


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 91 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 11 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 91 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 11 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# బీఆర్ఎస్ నా ఫోన్ ట్యాప్ చేస్తోంది



- నా మాటలు ఎలా లీక్ అయ్యాయి..?
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి అనుమానాలు
- సమీక్షలో మాట్లాడిన మాటలు లీక్ అయ్యాయని వ్యాఖ్య
- ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎవరు విన్నారో విచారణ చేయిస్తానని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ నేతలు ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారేమోననే అనుమానం వస్తోందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాను సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ అయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.



## అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను..

### స్పీకర్ ఓం బిర్లా సంచలన నిర్ణయం!

- లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్షాల అవిశ్వాస తీర్మానం నోటీసు
- ఈ విషయం తేలేదాకా విధులకు దూరంగా ఉంటానన్న ఓం బిర్లా
- ఇది తన నైతిక బాధ్యత అని, చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేసిన స్పీకర్
- మార్చి 9న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశం

- మిగతా 2లో



## నా పేరును మార్చడానికి మీరెవరు?

### రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం

- మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలువడమేమిటని ఆగ్రహం
- అవసరమైతే రేవంత్ ఖాన్‌గా మార్చుకోవాలని ఎద్దేవా
- అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీత

**హైదరాబాద్ పెన్ పవర్:**మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే

- మిగతా 2లో



## కాంగ్రెస్ నేతలపై రూ. 500 కోట్లకు పరువునష్టం దావా వేసిన అసోం సీఎం

- హిమంత, ఆయన కుటుంబం 12 వందల ఎకరాల భూమిని ఆక్రమించారన్న కాంగ్రెస్ నేతలు
- తన పరువుకు భంగం కలిగించే ఆరోపణలు చేశారన్న హిమంత
- జితేంద్ర సింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగోయ్ లపై దావా వేశానన్న సీఎం

- మిగతా 2లో

## లిబియా తీరంలో వలసదారుల పడవ మునక.. 53 మంది మృతి



- లిబియా తీరంలో రబ్బరు బోటు బోల్తా
- 55 మంది వలసదారులలో 53 మంది మృతి
- మృతుల్లో ఇద్దరు పసిపిల్లలు కూడా ఉన్నట్లు వెల్లడి
- ఈ ఏడాది మధ్యధరా సముద్రంలో 500 మంది మరణించినట్లు ఐఓఎం అంచనా
- లిబియాలో నెలకొన్న అరాచకమే కారణమంటున్న నిపుణులు

- మిగతా 2లో




## వరల్డ్ బ్యాంక్ ర్యాంకింగ్స్ లో భారత్ పైపైకి!

- గత ఐదేళ్లలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో 79 స్థానాలు మెరుగు
- పార్లమెంటులో వెల్లడించిన కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద
- 'డూయింగ్ బిజినెస్' బదులు వరల్డ్ బ్యాంక్ కొత్త 'బీ-రెడీ' అసెస్‌మెంట్
- 2026 నివేదికలో భారత్‌కు చోటు కల్పించనున్నట్లు వెల్లడి
- సంస్కరణల ద్వారా 47,000కు పైగా నిబంధనల భారం తగ్గింపు

- మిగతా 2లో

## ఎమ్మెల్యే కాన్వాయ్ పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ మద్యం మత్తులో బస్సును నడపడమే కారణం
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘటన..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే



**హైదరాబాద్ పెన్ పవర్:**మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ఎమ్మెల్యే కాన్వాయ్ పైకి దూసుకెళ్లింది. ఎమ్మెల్యే కారు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అయితే, బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం గమనించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- మిగతా 2లో



## తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు... సర్వం సిద్ధం

- తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం పోలింగ్
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 52 లక్షల మందికి పైగా ఓటర్లు
- మొత్తం 2,981 వార్డులకు బరిలో 12,944 మంది అభ్యర్థులు

- మిగతా 2లో

## వాటర్ మార్క్ తప్పనిసరిగా వేయాలి...

### ఏఐ కంటెంట్‌పై కేంద్రం సంచలన ఉత్తర్వులు

- ఏఐ' కంటెంట్ దుర్వినియోగంపై సోషల్ మీడియాకు కేంద్రం కీలక ఆదేశాలు
- చట్టవిరుద్ధమైన అంశాలను నిరోధించడానికి ఆటోమేటెడ్ సాధనాలు ఉండాలన్న కేంద్రం
- ఏఐ జనరేటెడ్ కంటెంట్‌కు లేబుల్ వేయాలని ఆదేశం
- దుర్వినియోగం చేస్తే పడే పెనాల్టీలు, శిక్షల గురించి అవగాహన కల్పించాలన్న కేంద్రం

- మిగతా 2లో






## ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

- నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఘటన
- ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన బీజేపీ అభ్యర్థి మహాదేవప్ప
- సోషల్ మీడియాలో ప్రత్యర్థుల వేధింపులే ఆత్మహత్యకు కారణమన్న భార్య సత్తెమ్మ

**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నారాయణపేట జిల్లాలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు చందాపూర్ గ్రామానికి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మున్సిపల్ సమరం: పోలింగ్ రోజు వ్యూహాల యుద్ధం

నేడు మున్సిపల్ పోలింగ్ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు మరొకసారి ఉత్కంఠ భరిత దశలోకి ప్రవేశించాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా పట్టణ పాలనకు సంబంధించినవిగా కనిపించినా, వాస్తవానికి ఇవి రాష్ట్ర స్థాయి రాజకీయాలపై ప్రభావం చూపే కీలక సమరాలుగా మారాయి. మున్సిపల్ ఎన్నికలు ప్రజల దైనందిన జీవితాలకు అత్యంత సమీపంగా ఉండే పరిపాలనా వ్యవస్థకు ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ కావడంతో, ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఈ పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటాయి. ఈ నేపథ్యంలో పోలింగ్ రోజున పోల్ మేనేజ్‌మెంట్, వనరుల వినియోగం, ఓటర్ల మొగ్గును ప్రభావితం చేసే వ్యూహాలు అన్నీ ఒకేసారి కేంద్రీకృతమై కనిపిస్తాయి.

మున్సిపల్ ఎన్నికల పూర్వాపరాలను పరిశీలిస్తే, పట్టణీకరణ వేగవంతమైన కొద్దీ స్థానిక సంస్థల ప్రాధాన్యం గణనీయంగా పెరిగింది. జనాభా పెరుగుదల, పట్టణ సేవలపై ఒత్తిడి, మౌలిక వసతుల విస్తరణ అవసరం వంటి అంశాలు మున్సిపల్ పాలనను రాజకీయంగా కీలకంగా మార్చాయి. గత రెండు దశాబ్దాల్లో పట్టణ జనాభా శాతం నిరంతరం పెరుగుతూ రావడం వల్ల, మున్సిపల్ సంస్థలు కేవలం చెత్త సేకరణ లేదా రహదారుల మరమ్మతులకే పరిమితం కాకుండా, పట్టణాభివృద్ధి, పన్నుల సేకరణ, పౌర సేవల డిజిటలైజేషన్ వంటి విస్తృత బాధ్యతలను చేపట్టాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు పట్టణ ఓటర్ల రాజకీయ దృక్పథాన్ని ప్రతిబింబించే సూచికలుగా మారాయి. పోలింగ్ రోజున ప్రధానంగా చర్చకు వచ్చే అంశం పోల్ మేనేజ్‌మెంట్. ఇది కేవలం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే కాదు; బూత్ స్థాయి వ్యూహాల సమన్వయం, కార్యకర్తల నియోజకవర్గ వారీ చురుకుదనం, ఓటర్ల జాబితాల పరిశీలన, చివరి నిమిషం సంప్రదింపులు వంటి అనేక అంశాల సమ్మిళితం. ప్రతి ప్రధాన పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, ఓటర్ల సామాజిక, ఆర్థిక నేపథ్యాలను విశ్లేషిస్తూ మైక్రో స్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తుంది. పోలింగ్ రోజున ఉదయం నుంచే ఓటింగ్ శాతం ఎలా పెరుగుతోంది, ఏ వార్డుల్లో ఓటింగ్ మందగిస్తోంది వంటి వివరాలను సమయానుకూలంగా విశ్లేషిస్తూ వ్యూహాలను మార్చడం ఆధునిక పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలక భాగంగా మారింది. ప్రధాన పార్టీల పోరు ఈ ఎన్నికల్లో బహుముఖంగా కనిపిస్తుంది. అధికార పార్టీ తన పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన అజెండాగా ప్రస్తావిస్తూ పట్టణ ఓటర్ల విశ్వాసాన్ని నిలబెట్టు కునేందుకు ప్రయత్నిస్తుంది. ప్రతిపక్షాలు మాత్రం స్థానిక సమస్యలు, పన్నుల భారం, మౌలిక వసతుల లోపాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ వ్యతిరేకతను సమీకరించేందుకు కృషి చేస్తాయి. మున్సిపల్ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిచయాలు, సామాజిక వలయాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల పార్టీ చిహ్నం ఎంత ముఖ్యమో, అభ్యర్థి స్థానిక ప్రాతినిధ్యం కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించు కుంటుంది. ఓట్లను అనుకూలంగా మలచు కోవడానికి ఎత్తుకు పై ఎత్తులు వేయడం ఎన్నికల రాజకీయాల్లో కొత్త విషయం కాదు. అయితే ఇటీవలి కాలంలో ఈ వ్యూహాలు మరింత వ్యవస్థీకృత రూపం దాల్చాయి. డేటా ఆధారిత ప్రచారం, ఓటర్ల విభజన, లక్ష్యిత కమ్యూనికేషన్ వంటి పద్ధతులు పట్టణ ఎన్నికల్లో విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, స్థానిక ప్రభావశీలుల ద్వారా సందేశాల వ్యాప్తి వంటి మార్గాలు పోలింగ్ రోజుకూడా చురుకుగా కొనసాగుతాయి. చివరి నిమిషం వరకు ఓటర్లను ప్రభావితం చేయాలనే ప్రయత్నం ప్రతి పార్టీలోనూ స్పష్టంగా కనిపిస్తుంది. వనరుల వినియోగం కూడా మున్సిపల్ ఎన్నికల్లో కీలక అంశం. మానవ వనరులు, ప్రచార సామగ్రి, రవాణా సౌకర్యాలు, డిజిటల్ కమ్యూనికేషన్?కలిసి ఒక సమగ్ర ఎన్నికల యంత్రాంగాన్ని నిర్మిస్తాయి. బూత్ స్థాయిలో కార్యకర్తల మోహరింపు, ఓటర్ల రాకపోకలకు సహకారం, ఎన్నికల నిబంధనలకు లోబడి నిర్వహించే సమన్వయం? ఇవి పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగం. ఎన్నికల సంఘం కఠిన నిబంధనలు అమలు చేస్తున్న నేపథ్యంలో, ప్రతి పార్టీ తన వ్యూహాలను చట్టబద్ధ పరిధిలోనే అమలు చేయాల్సిన అవసరం పెరిగింది. గణాంకాల పరంగా చూస్తే, మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం సాధారణంగా రాష్ట్ర లేదా జాతీయ ఎన్నికలతో పోలిస్తే కొద్దిగా తక్కువగా ఉండే ధోరణి కనిపించినా, పట్టణాల్లో స్థానిక సమస్యలు ముదిరినప్పుడు ఓటర్ల చురుకుదనం పెరుగుతుంది. మహిళలు, యువత, మధ్యతరగతి ఓటర్ల భాగస్వామ్యం పెరగడం పట్టణ ఎన్నికలలో ఒక ముఖ్య లక్షణంగా మారింది. స్వయం సహాయక సంఘాలు, కాలనీ సంఘాలు, వృత్తి వర్గాల సమీకరణ కూడా ఓటింగ్ సరళిపై ప్రభావం చూపుతుంది. ప్రధాన పార్టీల అవకాశాలను విశ్లేషించినప్పుడు స్థానిక రాజకీయ సమీకరణలు కీలకంగా మారతాయి. అధికార పార్టీకి పాలనా ప్రయోజనం, అమలు చేసిన సంక్షేమ?అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం కొంత మేర అనుకూల వాతావరణాన్ని కల్పించవచ్చు. అయితే స్థానిక అసంతృప్తి, అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి, వర్గపోరు వంటి అంశాలు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ప్రతిపక్షాలకు ప్రజా అసంతృప్తిని సమీకరించే అవకాశం ఉన్నప్పటికీ, బలమైన స్థానిక నాయకత్వం లేకపోతే అది ఓట్లుగా మారడం సవాలుగా మారుతుంది. చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కొన్ని వార్డుల్లో కింగ్‌మేకర్ పాత్ర పోషించే పరిస్థితులు కూడా ఉత్పన్నమవుతాయి.పోలింగ్ రోజున పరిపాలనా యంత్రాంగం పాత్ర అత్యంత కీలకం. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, మైక్రో అబ్జర్వర్లు వంటి చర్యలు అమల్లో ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞాన వినియోగంతో పోలింగ్ ప్రక్రియ పారదర్శకత పెరిగింది. ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు, సౌకర్యాల కల్పన వంటి చర్యలు పాల్గొనేకను పెంచేందుకు దోహద పడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల విస్తృత ప్రభావాన్ని పరిశీలిస్తే, ఇవి భవిష్యత్తు రాజకీయ ధోరణులకు సూచికలుగా నిలుస్తాయి. పట్టణ ఓటర్ల అభిరుచులు రాష్ట్ర రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పార్టీలకు ఇది తమ బలాబలాలను అంచనా వేసుకునే అవకాశం కాగా, ప్రజలకు స్థానిక పాలనపై తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచే వేదిక. పోలింగ్ శాతం, వార్డు వారీ ఫలితాలు, ఓట్ల మార్జిన్లు? ఇవి భవిష్యత్తు వ్యూహాల రూపకల్పనకు ఆధారాలుగా మారతాయి. మొత్తంగా చూస్తే, నేటి మున్సిపల్ పోలింగ్ కేవలం ఓటు హక్కు వినియోగం మాత్రమే కాదు; పట్టణ ప్రజాస్వామ్యానికి ఒక పరీక్ష. ప్రధాన పార్టీల వ్యూహాలు, పోల్ మేనేజ్‌మెంట్ సామర్థ్యం, ఓటర్ల చైతన్యం?కలిసి ఈ ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తాయి. స్థానిక సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, ప్రజా భాగస్వామ్యం వంటి అంశాలు ముందుకు రావడం ద్వారా మున్సిపల్ వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది అయిన స్థానిక సంస్థల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తు చేస్తూ, పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టంగా నిలుస్తాయి.

# నా పేరును మార్చడానికి మీరెవరు?

- మొదటి పేజీ తరువాయి
ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు.కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు.బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇచ్చిన హామీలను రెండేళ్ల పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు.

## లిబియా తీరంలో వలసదారుల పడవ మునక.. 53 మంది మృతి

లిబియా తీరంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. వలసదారులు, శరణార్థులతో వెళుతున్న ఒక రబ్బరు బోటు మధ్యధరా సముద్రంలో మునిగిపోవడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలస సంస్థ (ఐఓఎం) అధికారికంగా ధృవీకరించింది. లిబియాలోని అల్-జావియా నుంచి గురువారం రాత్రి 55 మందితో ఈ బోటు బయలుదేరింది. ప్రయాణం మొదలైన ఆరు గంటల తర్వాత, జువారా తీరానికి సమీపంలో బోటులోకి నీరు చేరి మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. వారిలో ఒకరు తన భర్తను కోల్పోగా, మరొకరు తన ఇద్దరు పిల్లలను కోల్పోయినట్లు కన్నీటిపర్యంతమయ్యారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ఘటన గత గురువారం జరిగినా, ఐఓఎం సోమవారం దీన్ని వెలుగులోకి తెచ్చింది. 2026లో ఇప్పటివరకు మధ్యధరా సముద్రం దాటే ప్రయత్నంలో దాదాపు 500 మంది మరణించడం లేదా గల్లంతవడం జరిగిందని ఐఓఎం తెలిపింది. ముఖ్యంగా శీతాకాలంలో స్మగ్లర్లు నడిపే పడవలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, చాలా సంఘటనలు నమోదు కావడం లేదని పేర్కొంది.2011లో గడాఫీ మరణం తర్వాత లిబియాలో అస్థిరత పెరిగింది. ఆఫ్రికా దేశాల నుంచి యూరప్ కు వెళ్లే వలసదారులకు ఇది ప్రధాన మార్గంగా మారింది. హింస, దోపిడీ, బలవంతపు చాకిరీ వంటి భయానక పరిస్థితుల నుంచి తప్పించుకునేందుకే ప్రజలు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు సిద్ధపడుతున్నారు. ఈ నేపథ్యంలో, మానవ అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అరికట్టడంతో పాటు, వలసలకు చట్టబద్ధమైన, సురక్షితమైన మార్గాలను ఏర్పాటు చేయాలని ఐఓఎం అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది.

## వాటర్ మార్క్ తప్పనిసరిగా వేయాలి...

కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా రూపొందించే కంటెంట్‌ను గుర్తించడానికి, నియంత్రించడానికి వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఆదేశాలు జారీ చేసింది. చట్టవిరుద్ధమైన, అసభ్యకరమైన, తప్పుదారి పట్టించే విషయాలను నిరోధించడానికి ఆటోమేటెడ్ సాధనాలను ఉపయోగించాలని తేవాలని సూచించింది. కృత్రిమ మేధస్సుతో రూపొందించిన కంటెంట్ కొత్త సవాళ్లు విసురుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌కు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా లేబుల్ వేయాలని ఆదేశించింది. కంటెంట్‌ను అందరు సులువుగా గుర్తించేలా ఆ లేబుల్ ఉండాలని స్పష్టం చేసింది. ఒకసారి దీనిని అప్లై చేశాక లేబుల్‌ను గానీ మెటా డేటాను గానీ తొలగించడానికి లేదా కనపడకుండా చేయడానికి వీలులేకుండా ఉండాలని పేర్కొంది. ఏఐ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే పడే పెనాల్టీలు, శిక్షల గురించి వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి యూజర్లకు సందేశాలు పంపించాలని ఆదేశాల్లో పేర్కొంది. ఏఐ జనరేటెడ్ లేదా డీప్ ఫేక్ కంటెంటును తొలగించాలని ప్రభుత్వం లేదా కోర్టులు ఆదేశించినప్పుడు దానిని మూడు గంటల్లోనే తొలగించాలని స్పష్టం చేసింది.

## వరల్డ్ బ్యాంక్ ర్యాంకింగ్స్ లో భారత్ పైపైకి!

వ్యాపార సౌలభ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)లో గత దశాబ్దంలో భారత్ ఏకంగా 79 ర్యాంకులు మెరుగుపరుచుకుంది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద మంగళవారం లోక్‌సభలో ఒక లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. వరల్డ్ బ్యాంక్ గ్రూప్ గతంలో ప్రచురించిన ర్యాంకింగ్స్‌లో ఈ పురోగతి నమోదైందని ఆయన తెలిపారు.వరల్డ్ బ్యాంక్ 2020లో 'డూయింగ్ బిజినెస్ రిపోర్ట్' (డీబీఆర్)ను నిలిపివేసిందని, దాని స్థానంలో 2024లో 'బీ-రెడీ' పేరుతో కొత్త అసెస్‌మెంట్‌ను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. 180 దేశాల్లో వ్యాపార జీవితచక్రంలోని 10 అంశాల ప్రాతిపదికన ఈ అంచనా ఉంటుందని చెప్పారు. 2026లో విడుదల కానున్న మూడో బీ-రెడీ నివేదికలో భారత్‌ను కూడా చేర్చనున్నట్లు ఆయన వివరించారు.దేశంలో వ్యాపార వాతావరణాన్ని మెరుగుపరిచి, పెట్టుబడులను ఆకర్షించేందుకు పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) పలు చర్యలు చేపట్టిందని జితిన్ ప్రసాద అన్నారు. ఇందులో భాగంగా 2014లో 'వ్యాపార సంస్కరణల కార్యాచరణ ప్రణాళిక' (బీఆర్ఏపీ)ను ప్రారంభించినట్టు తెలిపారు. సింగిల్ విండో వ్యవస్థలు, భవన నిర్మాణ అనుమతుల సరళీకరణ, డిజిటల్ సేవలు వంటివి ఇందులో భాగమని పేర్కొన్నారు. ఈ ప్రణాళిక కింద ఇప్పటివరకు ఏడుసార్లు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేసినట్టు మంత్రి వివరించారు. దీని ద్వారా రాష్ట్రాల స్థాయిలో 9,700కు పైగా సంస్కరణలు అమలయ్యాయని తెలిపారు. అంతేకాకుండా, 2020లో ప్రారంభించిన 'నిబంధనల భారం తగ్గింపు' (ఆర్.సి.బి) కార్యక్రమం కింద వ్యాపారాలు, పౌరులపై భారం మోపుతున్న 47,000కు పైగా నిబంధనలను గత దశాబ్దంలో తగ్గించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే కాన్వాయ్ పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- మొదటి పేజీ తరువాయి
వివరాల్లోకి వెళితే..కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మంచిర్యాలలోని బస్టాండ్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి మీదికి దూసుకొచ్చింది. కారు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎమ్మెల్యే పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. అనంతరం ఆర్టీసీ బస్సు డ్రైవర్ తో ఎమ్మెల్యే మాట్లాడారు. బస్సు అదుపు తప్పడానికి కారణమేంటనే విషయంపై ఆరా తీస్తుండగా డ్రైవర్ జక్కుల మల్లేశ్ వద్ద నుంచి మద్యం వాసన వచ్చింది. దీంతో పోలీసులను పిలిపించి డ్రైవర్ కు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేయించారు. ఈ టెస్టులో 105 పాయింట్లు వచ్చినని పోలీసులు తెలిపారు. మద్యం సేవించి బస్సు నడిపినట్లు నిర్ధారణ కావడంతో డ్రైవర్ మల్లేశ్ ను అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు... సర్వం సిద్ధం

తెలంగాణలో పురపాలక ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో బుధవారం (ఫిబ్రవరి 11) పోలింగ్ జరగనుండగా, ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52,17,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 8,191 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటర్ స్లిప్పులను ఎస్ఈసీ వెబ్‌సైట్ లేదా 'టీ-పోల్' యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 2,981 వార్డులకు గాను 12,944 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.వివరాల్లోకి వెళ్తే, 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డులకు పోలింగ్ జరగనుంది. తొమ్మిది మున్సిపాలిటీల్లో 12 మంది అభ్యర్థులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ నుంచి 2,358 మంది, బీఆర్ఎస్ నుంచి 2,478 మంది, బీజేపీ నుంచి 2,252 మంది సహా మొత్తం 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే, సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వార్డులో పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటించింది. మున్సిపాలిటీల కోసం 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఐ

ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 412 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలో రెండు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ కార్పొరేషన్లలో కాంగ్రెస్ నుంచి 410, బీఆర్ఎస్ నుంచి 401, బీజేపీ నుంచి 382 మంది సహా మొత్తం 2,225 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్ల పరిధిలో 2,174 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1,302 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, అక్కడ అదనపు బలగాలను మోహరించామని వివరించారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లోని కేంద్రాల బయట నిఘా కెమెరాలు కూడా ఉపయోగిస్తున్నామని చెప్పారు.

# అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను..

లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన అభిప్రాయాన్ని మంగళవారం వివిధ పార్టీల నేతలకు, ప్రతిపక్ష నాయకులకు కూడా తెలియజేశారు. ప్రభుత్వం గానీ, ప్రతిపక్షాలు గానీ కోరినా తాను తన నిర్ణయాన్ని మార్చుకోబోనని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అవిశ్వాస తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం తొలి రోజైన మార్చి 9న జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు ఓం బిర్లా స్పీకర్ సీటుకు దూరంగా ఉండనున్నారు. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాసాలు ఎప్పుడూ నెగ్గనప్పటికీ, తాజా పరిణామంతో బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

## కాంగ్రెస్ నేతలపై రూ. 500 కోట్లకు పరువునష్టం దావా వేసిన అసోం సీఎం

అసోం అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ఈ క్రమంలో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, ఆయన కుటుంబ సభ్యులు 1,200 ఎకరాల భూములు ఆక్రమించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీంతో, కాంగ్రెస్ నేతలు జితేంద్ర సింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగోయ్ లపై హిమంత రూ. 500 కోట్లకు పరువునష్టం దావా వేశారు. తన పరువుకు భంగం కలిగించేలా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు జితేంద్ర సింగ్, భూపేంద్ర సింగ్ బఘేల్, గౌరవ్ గొగోయ్ లపై పరువునష్టం దావా వేశానని హిమంత తెలిపారు. మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనపై దురుద్దేశపూర్వకంగా, పరువుకు భంగం కలిగించేలా తప్పుడు ఆరోపణలు చేశారని మండిపడ్డారు. వారి నుంచి రూ. 500 కోట్ల నష్ట పరిహారం కోరుతూ పరువునష్టం దావా వేశానని తెలిపారు.

## ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

- మొదటి పేజీ తరువాయి
చెందిన మహదేవప్ప (48) బీజేపీ తరఫున కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అయితే మంగళవారం తెల్లవారుజామున ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై మహదేవప్ప భార్య సత్తెమ్మ తీవ్ర ఆరోపణలు చేసింది. సోషల్ మీడియాలో ప్రత్యర్థుల వేధింపులు, అవమానకర ప్రచారాల కారణంగానే భర్త ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## చంద్రబాబు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారు

తిరుమల లడ్డూపై సిట్ ఇచ్చిన రిపోర్ట్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి విమర్శలు గుప్పించారు. చంద్రబాబు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారని ఎద్దేవా చేశారు. అందుకే కొంత మంది స్వాములను భయపెట్టి చంద్రబాబు లేఖలు రాయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద జీయర్ స్వామితో బీఆర్ నాయుడు, ముద్దాడ రవిచంద్ర బలవంతంగా లేఖ రాయించారని అన్నారు. చంద్రబాబు ఆడుతున్న క్షుద్ర రాజకీయ క్రీడలో ఆధ్యాత్మికవేత్తలు కూడా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాములను భయపెట్టి చంద్రబాబు ఏం సాధించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని అన్నారు. చంద్రబాబు రెడ్ బుక్ పాలన చివరకు పెద్ద జీయర్ స్వామిపైకి కూడా మళ్లిందని భూమన విమర్శించారు. కొంతమంది స్వాములకు భక్తి కంటే పైరవీలే ఎక్కువ అవసరమని అన్నారు. దర్యాప్తు సంస్థలు ఇచ్చిన నివేదికలపై ఎల్లో మీడియా దాడి చేస్తోందని మండిపడ్డారు. లడ్డూ అంశంలో రాజకీయ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని సిట్ తన నివేదికలో స్పష్టం చేసిందని చెప్పారు. హైందవ సమాజానికి చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా వేదనకు గురి చేయడం సరికాదన్న బండి సంజయ్
- ప్రభుత్వం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన
- హైదరాబాద్ నడిబొడ్డున ఆందోళన, దీక్ష చేస్తామని హెచ్చరిక



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించకుండా మానసిక వేదనకు గురి చేయడం సరికాదని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

-4 లో

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్ష

## రాజకీయ దురుద్దేశంతో నిధుల్లో కోత

## రాష్ట్రం ఇచ్చేది రూ.1.33 లక్షల కోట్లు.. తిరిగొచ్చేది రూ.51 వేల కోట్లే

## మంత్రి తుమ్మల ధ్వజం



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో తెలంగాణపై తీవ్ర వివక్ష చూపుతూ..దగా చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లో చేర్చాలంటూ రాష్ట్రం పంపిన ప్రతిపాదనలలో ఒక్కదాన్ని కూడా కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి వివిధ పన్నుల రూపంలో రూ.1,33,208 కోట్లు కేంద్ర ఖజానాకు వెళు తుండగా..అన్ని కేంద్ర పథకాలతో కలిపి కేవలం రూ.51 వేల కోట్లు మాత్రమే తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలపై భారీగా ఖర్చు చేస్తోందని, ఈ పరిస్థితుల్లో కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ప్రగతికి అడ్డంకిగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాకోసం కేంద్రంతో పోరాటానికి తమతో కలిసి రావాలని కోరారు. మంగళవారం తుమ్మల విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. కేంద్రంపై

-4 లో

# మాదాపూర్ ఎస్సైని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ

- మాదాపూర్ ఎస్సై వినయ్ ని అదుపులోకి తీసుకున్న ఏసీబీ
- రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- నగదును సీజ్ చేసిన అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో మరో అవినీతి పోలీసు అధికారిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మాదాపూర్ ఎస్సై వినయ్ ఈరోజు రూ. 50 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్ అయ్యారు. వివరాల్లోకి వెళితే, ఓ కేసు విషయంలో సహకారం అందిస్తానంటూ ఫిర్యాదుదారుడి నుంచి వినయ్ రూ. 50 వేలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారుడి నుంచి లంచం డబ్బులు తీసుకుంటున్న తరుణంలో ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. ఎస్సైని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నగదును సీజ్ చేశారు. ఎస్సై వినయ్ ని అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సీఎం ఎందుకు డిమాండ్ చేయరు?

## కృష్ణా జలాల్లో 664 టీఎంసీలను ఏపీ తీసుకుపోయింది

## రాష్ట్ర హక్కుల కోసం ప్రత్యక్ష పోరాటం చేస్తాం: హరీశ్‌రావు




**హైదరాబాద్ పెన్ పవర్:** కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకుపోతుంటే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు డిమాండ్ చేయడం లేదని భారాస శాసనసభా పక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ అవసరాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని నిలదీశారు. కృష్ణా జలాల హక్కుల కోసం భారాస ప్రత్యక్ష పోరాటానికి దిగుతుందని వెల్లడించారు. అవసరమైతే కేఆర్‌ఎంబీని ముట్టడిస్తామని, పార్లమెంట్‌లో ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం పార్టీ శాసనమండలి పక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్యే వివేకానందతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. “కృష్ణా జలాల్లో 664 టీఎంసీలను(80శాతం) ఏపీ వాడుకుంది. ఇదే విషయాన్ని జనవరి 28న కేఆర్‌ఎంబీకి అప్పటి నీటిపారుదల శాఖ ఈఎన్సీ లేఖ రాశారు.అదే నెల 31న ఆయన రిటైరవగా ఈ పోస్టును ఖాళీగా ఎందుకు పెట్టారు? ఈ రోజు(మంగళవారం) కూడా ఏపీ ఒకటిన్నర టీఎంసీల నీటిని తరలించుకుపోయింది. ఈఎన్‌సీ లేఖ ప్రకారం కోటాకు మించి అదనంగా 16 టీఎంసీలను ఏపీ తీసుకెళ్లింది. ఈ నెల 6న ఏపీకి కేఆర్‌ఎంబీ.. ఇప్పటి వరకు 555 టీఎంసీల నీటిని తరలించారని, వాడకాన్ని ఆపాలని లేఖ రాసింది. కేంద్రంలో.. మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ వ్యవహారంలో ఏం చేస్తున్నారు? కాంగ్రెస్, భాజపాలు తెలంగాణ నీటి హక్కును ఏపీకి దోచిపెడుతున్నాయి. ఏపీకి నీటి మళ్లింపులను ఆపి శ్రీశైలం, సాగర్‌లకు భవిష్యత్తు అవసరాల కోసం రాష్ట్ర వాటాను తరలించాలి. భారాస ప్రభుత్వం కృష్ణానదిపై 19 చోట్ల టెలిమెట్రీలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటీ పెట్టలేదు. ఇందుకోసం ఇచ్చిన రూ.4 కోట్లను బోర్డు వాడుకున్నా సీఎం నోరు విప్పడం లేదు” అని హరీశ్‌రావు విమర్శించారు.

# బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యకు ఆ మంత్రి బెదిరింపులే కారణం

## మక్తల్ లో మహదేవప్ప ఆత్మహత్య కలచివేసిందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

## కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలే కారణమని ఫైర్

## నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కు ముందు మక్తల్ లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. అధికార పార్టీ కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపుల వల్లే తమ అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపించారు. మహదేవప్ప మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, అతని కుటుంబానికి సంతాపం తెలిపారు. మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపుల వల్లే మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. మంత్రి శ్రీహరిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని అన్నారు. మహదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం చేస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జగ్గారెడ్డిపై సదాశివపేటలో కేసు నమోదు

## ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ జగ్గారెడ్డిపై కేసు నమోదు

## పేదలకు, వృద్ధులకు డబ్బులు పంచారంటూ కేసు

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై కేసు నమోదయింది. మున్సిపల్ ఎన్నికల నియమావళిని ఉల్లగించారని ఆయనపై సదాశివపేట పీఎస్ లో కేసు నమోదు చేశారు. సదాశివపేటలోని ఓ హోటల్ వద్ద పేదలకు, వృద్ధులకు డబ్బులు పంచుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే సీఐ వెంకటేశ్ అక్కడకు చేరుకుని... అక్కడ ఉన్న జగ్గారెడ్డిని, మరికొందరు స్థానికులను అక్కడి నుంచి పంపించివేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో డబ్బులు పంచడం పట్ల పీఎస్ లో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మరోవైపు, దీనిపై జగ్గారెడ్డి అనుచరులు స్పందిస్తూ... ఆ హోటల్ వద్ద జగ్గారెడ్డికి టీ తాగే అలవాటు ఉందని... ఆయన అక్కడ ఆగిన సమయంలో తన వద్దకు వచ్చిన పేదలకు, వృద్ధులకు డబ్బులు ఇచ్చినట్టు తెలిపారు. ఈ ఘటనపై జగ్గారెడ్డి ఇంకా స్పందించాల్సి ఉంది. మరోవైపు, మున్సిపల్ ఎన్నికలు రేపు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సాధ్యమైనంత ఎక్కువ విజయాలను సాధించి మరోసారి సత్తా చాటాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉంది. ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి పూర్వవైభవాన్ని పొందే దిశగా అడుగులు వేయాలని బీఆర్ఎస్ శ్రమిస్తోంది.

# తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్ష

-3 పేజి తరువాయి
ఆధారపడేలా చేయాలనే వ్యూహం

జీఎస్టీ సవరణల కారణంగా రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోంది. మరోవైపు రంగాల వారీగా రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కోత పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతింటోంది. బలమైన రాష్ట్రాలను బలహీనపరిచి, ఆర్థికంగా తమపై ఆధారపడేలా చేయాలనే రాజకీయ ఉద్దేశం ఇందులో ఉన్నట్లు కనిపిస్తోంది. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగినప్పుడే..దేశం సమగ్రాభివృద్ధి సాధించడం, వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందనే సత్యాన్ని గుర్తెరగాలి.

**భాజపా ఎంపీలు అన్యాయాన్ని ప్రశ్నించరేం?**

తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే ఇద్దరు కేంద్ర మంత్రులు, భాజపా ఎంపీలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడూ ప్రశ్నించకపోగా.. రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. జాతీయ రహదారుల నిర్మాణాలకు వెచ్చించే సొమ్మును కూడా రాష్ట్రానికి విడుదలచేసే నిధులుగా చూపుతూ భాజపా నేతలు గొప్పలు చెబుతున్నారు. ఆ రహదారుల నిర్మాణ ఖర్చును టోల్‌ఛార్జీల రూపంలో మళ్లీ ప్రజల నుంచే వసూలు చేస్తారనే విషయాన్ని వాళ్లు విస్మరిస్తున్నారు’ అని తుమ్మల ధ్వజమెత్తారు.

**వసూలు చేసేది రూపాయి.. తిరిగి ఇచ్చేది 30 పైసలు**

“2018-19, 2022-23 మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పన్నుల రూపంలో రూ.90.80 లక్షల కోట్లు వసూలు చేసింది. అందులో దక్షిణాది రాష్ట్రాల వాటా రూ.22.86 లక్షల కోట్లుకాగా..ఆయా రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చింది కేవలం 16.3 శాతం మాత్రమే. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో వసూలుచేసిన రూపాయికి.. సగటున 30 పైసలే తిరిగి ఇస్తోంది. ఇదే సమయంలో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూపాయికి..రూ.4 చొప్పున తిరిగి ఇస్తోంది. ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారింది. ఉదాహరణకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.1,33,208 కోట్లు పన్నుల రూపంలో కేంద్ర ఖజానాకు వెళ్లగా..కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి పన్నుల రూపంలో రూ.27,050 కోట్లు, గ్రాంట్ల రూపంలో రూ.7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రూ.16,762 కోట్ల చొప్పున మొత్తంగా రూ.51,725 కోట్లు వచ్చాయి. ఈ విషయాన్ని ఇటీవల పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి స్వయంగా వెల్లడించారు”

# కొత్తజిల్లాల ఆశలపై నీళ్లు

**వరంగల్, ఫిబ్రవరి 10, పెన్ పవర్:** తెలంగాణలో జిల్లాల పునర్విభజన, ప్రస్తుత జిల్లాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతోందనే ఉత్కంఠకు సీఎం తెరదించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏ ఒక్క జిల్లాను కూడా రద్దు చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా రద్దు అవుతుందనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సెంటిమెంట్లు, ఆయన లక్కీ నంబర్ ఆధారంగానే జిల్లాల విభజన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ విమర్శిస్తూ వస్తోంది. పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా జిల్లాల ఏర్పాటు జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న జిల్లాలను తొలగించడం కంటే, ఉన్నవాటిని పటిష్టం చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం, అక్కడి బహిరంగ సభలో జిల్లా ఉనికిపై భరోసా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, భూపాలపల్లి ఒక చిన్న కుగ్రామంగా ఉన్న దశ నుంచి నేడు మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఎదగడం వెనుక ఎందరో కృషి ఉందని రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు భూపాలపల్లిని మండల కేంద్రంగా మార్చడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పునాది ఇక్కడే పడిందని,



ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు.జిల్లాల పునర్విభజన లేదా మార్పులపై భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అది ఏకపక్షంగా ఉండదని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత, అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రకటించారు. రహస్య నిర్ణయాలు లేదా రాజకీయ కుట్రలకు తమ ప్రభుత్వంలో తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు.ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొంతమంది కావాలనే జిల్లాల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఇలాంటి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ బోర్డు విషయంలో కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను తిప్పికొడతామని, కార్మికుల వల్లే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆయన కృతజ్ఞత చాటుకున్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెడతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో జిల్లాల భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారానే ఏ నిర్ణయమైనా ఉంటుందని చెప్పడం ద్వారా ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. భూపాలపల్లి జిల్లా ఉనికిపై ఆయన ఇచ్చిన హామీ ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది.

# గులాబీ పరువు నిలిచేనా

**హైదరాబాద్ ఫిబ్రవరి 10, పెన్ పవర్:** అధికారం ఉన్నప్పుడు ఏదైనా చేయవచ్చు. సాధ్యం కానిది కాళ్ల దగ్గరికి తెచ్చుకోవచ్చు. 2020 పురపాలక ఎన్నికల్లో గులాబీ పార్టీ ఇలానే చేసింది. అధికారాన్ని ఉపయోగించింది. అంగ బలాన్ని ప్రయోగించింది. అర్థాన్ని వాడింది. తద్వారా తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది.2020లో జనవరి నెలలో పురపాలక ఎన్నికలు జరిగాయి. నాటి ఎన్నికల్లో 120 మున్సిపాలిటీలు.. 9 కార్పొరేషన్లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. నాటి ఎన్నికలలో గులాబీ పార్టీ సత్తా చూపించింది. 120 మున్సిపాలిటీలలో ఏకంగా 110 కంటే ఎక్కువ మునిసిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. 9 కి 9 కార్పొరేషన్లను గులాబీమయం చేసింది. మొత్తం 2727 వార్డులలో దాదాపు 70 శాతానికి దగ్గరగా స్థానాలను గులాబీ పార్టీ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 500 వార్డులలో సత్తా చూపిస్తే.. బిజెపి 200 వార్డులలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది.2020 పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యంత దయనీయమైన స్థితిలో ఉండేది. చాలా ప్రాంతాలలో రెండవ స్థానంలో నిలిచినప్పటికీ మునిసిపల్ పీఠాలను అందుకోలేకపోయింది. నాడు హుజుర్ నగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలో గులాబీ పార్టీ విజయం సాధించిన తర్వాత.. పురపాలక ఎన్నికలు వచ్చాయి. దీంతో గులాబీ పార్టీ సహజంగానే జోష్ మీద పాల్గొంది. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన కంచుకోటలను కూడా కాపాడుకోలేకపోయింది. పట్టణ ప్రాంతాలలో బిజెపి సత్తా చూపించినప్పటికీ.. అది కొన్ని ప్రాంతాలలో మాత్రమే ప్రభావం చూపించింది. 2020 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు సత్తా చూపించడం విశేషం.నాటి ఎన్నికల్లో గులాబీ పార్టీ కొత్త మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చింది. దానిని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. అయినప్పటికీ అధికారాన్ని ఉపయోగించి గులాబీ పార్టీ ఇష్టానుసారంగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. వాటి ద్వారానే ఎన్నికలు జరిపింది. ఇక ఓటర్ల జాబితా గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇలా అన్ని రకాలుగా అధికార దర్పాన్ని ప్రయోగించి గులాబీ పార్టీ నాటి ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు సాధించింది. ఇక ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి మరో విధంగా ఉంది. అధికార పార్టీగా కాంగ్రెస్ కొనసాగుతోంది. అప్పటి పురపాలక ఎన్నికల్లో కేటీఆర్, హరీష్ రావు ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు వారిద్దరూ కనిపించడం లేదు. అందువల్లే గులాబీ పార్టీ ఆత్మ రక్షణ ధోరణిలో పడిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.




# కోట్లు కురిపిస్తున్న మేడారం హుండీలు

**వరంగల్ ఫిబ్రవరి 10, పెన్ పవర్:**ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఇటీవల పూర్తయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు వచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఇక మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండకు తీసుకువచ్చి.. టీటీడీ కల్యాణ మండపంలో గత గురువారం రోజున లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇవాళ్టికి గత 5 రోజులుగా హుండీలను లెక్కించే పనిలో దేవాదాయ శాఖ సిబ్బంది తలమునకలై ఉన్నారు. ఇక ఐదోరోజు 163 హుండీలను లెక్కించిన అధికారులు ఇప్పటివరకు వచ్చిన ఆదాయం వివరాలను వెల్లడించారు. ఒక్కరోజే 163 హుండీలను లెక్కించగా.. అందులో మొత్తం రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు గత 5 రోజుల్లో మొత్తం 788 హుండీలను లెక్కించినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో మొత్తంగా ఇప్పటివరకు రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇందులో మన దేశ కరెన్సీతోపాటు విదేశాలకు చెందిన నోట్లు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు 18 దేశాలకు చెందిన నోట్లు వచ్చాయని వెల్లడించారు.మిగిలిన హుండీల లెక్కింపు ప్రక్రియ కూడా ముమ్మరంగా సాగుతోందని ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. లెక్కింపు పూర్తి కావడానికి మరో రెండ్రోజుల సమయం పట్టవచ్చని సిబ్బంది అంచనా వేశారు. ఇప్పటివరకు డబ్బులు మాత్రమే లెక్కిస్తుండగా.. ఈ నోట్లు మొత్తం లెక్కించడం పూర్తి అయిన తర్వాత బంగారం, వెండి వస్తువులను వాటి బరువు ఆధారంగా విలువను నిర్ధరించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు.. మేడారం మహాజాతరలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయంలో 33 శాతాన్ని మేడారం పూజారులకు అందించనున్నారు. ఇక గతంలో నిర్వహించిన మహాజాతరలో సుమారు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే.. ఈసారి భారీగా పెరగనున్నట్లు దేవాదాయ శాఖ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. గతంతో పోల్చితే 3 రెట్లు అధికంగా హుండీ ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.ఇక మొత్తం హుండీల లెక్కింపునకు దాదాపు 10 రోజులకు పైనే సమయం పడుతుందని పేర్కొంటున్నారు. హుండీల్లో డబ్బులు, బంగారం, వెండి, ఇతర ఆభరణాలు, విదేశీ కరెన్సీ లెక్కింపు ఇంతా పూర్తి అయిన తర్వాత మొత్తం ఈసారి ఆదాయం ఎంత వచ్చింది అనేదానిపై అధికారిక ప్రకటన చేయనున్నారు.ఈ మహాజాతరలో భాగంగా గద్దెల ప్రాంగణంలో మొత్తం 828 హుండీలను ఏర్పాటు చేశారు. వాటిలో 780 ఇనుప హుండీలు కాగా.. 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక హుండీల్లో పాత రూ.500, రూ.1000 నోట్లు కూడా వస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు.. మరికొందరు భక్తులు పేపర్లు, నోట్లపై తమ కోరికలను రాసి వాటిని తీర్చాలంటూ సమ్మక్క సారలమ్మలను వేడుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి బండి సంజయ్ బహిరంగ లేఖ

-3 పేజి తరువాయి
పదవీ విరమణ చేసి రెండేళ్లయినా బెనిఫిట్స్ బకాయిలను చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. రిటైర్డ్ అయ్యాక ప్రశాంతమైన జీవితాన్ని గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మానసిక వేదనకు గురి చేస్తుండటం క్షమించరాని నేరమని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృత్యు ఒడికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే బెనిఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. తక్షణమే వారి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష చేస్తామని అన్నారు.

## కాలి నడకన బడికి.... బస్సు వేయరా సారు

**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మఠం పల్లి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు రోజూ 8 కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి నెలకొంది. ఒకప్పుడు నడిచిన బస్సులు ఇప్పుడు రావడం లేదు, ఆటోల రాకపోకలపై స్పష్టత లేదు. దీంతో విద్యార్థులు ద్విచక్ర వాహనాల వారిని లిఫ్ట్ అడిగి ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితి వారి చదువుపై, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

## గ్రానైట్స్ షాప్ లో అగ్ని ప్రమాదం

**ఆలేరు, ఫిబ్రవరి 10పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని తిరుపతి టైల్స్ అండ్ గ్రానైట్స్ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 6 లక్షల రూపాయల మేర నష్టం జరిగినట్లు షాపు యజమాని రవిశైని తెలిపారు.

## 3 రోజులు విద్యాసంస్థలకు సెలవు

**కామారెడ్డి, ఫిబ్రవరి 10పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలోని4 మున్సిపాలిటీల్లోని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు ఆశా రాజు తెలిపారు. పోలింగ్ ఏర్పాట్ల దృష్ట్యా ఫిబ్రవరి 10, పోలింగ్ రోజైన 11, ఓట్ల లెక్కింపు జరిగే ఫిబ్రవరి 13వ తేదీన సెలవు వర్తిస్తుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## పోచారం శ్రీనివాసరెడ్డి 77వ జన్మదిన వేడుకలు ఘనంగా



**బాన్సువాడ, ఫిబ్రవరి 10పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా బాన్సువాడలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తన 77వ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు, నాయకులు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. ఆయన సతీమణి పుష్ప పోచారం, సోదరుడు పోచారం శంభు రెడ్డి, రాష్ట్ర అగ్రోస్ కాసుల బాలరాజు, కుమారులు మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి, బాన్సువాడ పట్టణ నాయకులు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ కార్యాలయంలో రాజకీయ వేడుకలు: కాంగ్రెస్ నాయకులపై ఆగ్రహం

**జుక్కల్, ఫిబ్రవరి 10పెన్ పవర్:** బోర్లం గ్రామ పంచాయతీ భవనంలో కాంగ్రెస్ నాయకులు పోచారం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ భవనాల్లో రాజకీయ నాయకుల జన్మదిన వేడుకలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని, ఇది పరిపాలనా విభాగానికి రాజకీయాలకు అతీతంగా ఉండాలనే నియమాలను ఉల్లంఘించడమేనని ప్రజలు, యువకులు మండిపడుతున్నారు. ఈ చర్యపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 10పెన్ పవర్:** వికారాబాద్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సి.హెచ్. చంద్రకిషోర్ ఒక సంచలన తీర్పు వెలువరించారు. 2023లో వికారాబాద్ మండలానికి చెందిన నరేందర్ అలియాస్ నరేష్ అనే వ్యక్తి బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో, నిందితుడికి ఇరవై ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించారు. సరైన సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో దాఖలు చేయడంతో నేరం రుజువైంది. బాధితురాలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల నష్ట పరిహారం అందించాలని కూడా తీర్పులో పేర్కొన్నారు.

## భూమి షేక్ అయినట్లు అనిపించడంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10పెన్ పవర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం ఆదర్శనగర్‌లో మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో భూమి కొన్ని సెకన్ల పాటు కదిలినట్లు స్థానికులు తెలిపారు. అకస్మాత్తుగా భూమి కంపించడంతో భయపడిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ఎన్నికలు సజావుగా జరగాలి: కలెక్టరేట్

**వికారాబాద్, ఫిబ్రవరి 10(పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా కలెక్టరేట్లో ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు రవి అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల అధికారుల రాండమైజేషన్ నిర్వహించి, విధులను కేటాయించారు. ప్రశాంతంగా, ఎలాంటి అవకతవకలు లేకుండా ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# తగ్గిన చికెన్, మటన్ ధరలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10, పెన్ పవర్:** పండుగల సీజన్, మేడారం జాతర ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు కొండెక్కగా.. ఇప్పుడు పండుగ సీజన్ ముగియడంతో ధరలు ఇప్పుడిప్పుడే దిగొస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో క్రిస్మస్ ఉండటం, ఆ తర్వాత కొత్త ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ రావడం, మేడారం జాతర జరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కేజీ చికెన్ రూ.350 వరకు తెలుగు రాష్ట్రాల్లో చేరుకుంది. కానీ ఇప్పుడు మెల్లమెల్లగా ధరలు తగ్గుతుండటంతో నాన్ వెజ్ ప్రియులు ఉపశమనం పొందుతున్నారు. జనవరి 8న సండే కావడంతో చికెన్‌కు డిమాండ్ ఉంటుంది. సెలవు కాకడంతో చికెన్ తినేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తారు. ధరలు తగ్గడం వీరికి కాస్త రిలీఫ్ ఇచ్చిందిప్రస్తుతం కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 240 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. ఇక డ్రెస్డ్ చికెన్ కిలో రూ.220 నుంచి రూ.230 వరకు ఉండగా.. లైవ్ చికెన్ రూ.118 నుంచి రూ.120కే లభిస్తుంది. మేడారం జాతర సమయంలో డిమాండ్ కారణంగా స్కిన్‌లెస్ చికెన్ రూ.350నుంచి రూ.380 వరకు కూడా వ్యాపారులు విక్రయించారు. ఇక డ్రెస్డ్ చికెన్‌ను రూ.350కు, లైవ్ కోడిని రూ.200 వరకు విక్రయించారు. జాతర ముగిసిన తర్వాత చికెన్ ధరలు ధమాల్ అంటూ పడిపోయాయి. వారం రోజుల వ్యవధిలోనే రూ.100 తగ్గడంతో నాన్‌వెజ్ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పండుగ సీజన్ ముగియడంతో కోళ్లకు డిమాండ్ పడిపోయిందని, ధరలు తగ్గడానికి ఇదే కారణమని వ్యాపారుల చెబుతున్నారు. అలాగే కోళ్ల ఉత్పత్తి కూడా పెరగడం వల్ల ధరలు పడిపోతున్నాయని అంటున్నారు.తెలుగు రాష్ట్రాల్లో కోళ్ల ఫామ్స్‌లో ఉత్పత్తి బాగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. ఇక చికెన్ ధరలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత నెలలో ఏకంగా ఒక్కో కోడిగుడ్డు ధర రూ.10కు చేరుకుంది. రిటైల్ షాపుల్లో రూ.10కి విక్రయించారు. ఇప్పుడు కేవలం ఒక్కో గుడ్డు రూ.6కే షాపుల్లో అమ్ముతున్నారు. కోడిగుడ్ల ధరలు కూడా ఒకేసారి కుప్పకూలాయి. దీంతో సామాన్యులకు ధరల భారం తగ్గిందని చెప్పవచ్చు. ఇవాళ అసలే సండే కారణంతో చికెన్ షాపుల ముందు జనం క్యూ కడుతున్నారు. చికెన్ కొనుగోలు చేసేందుకు ఎగబపడుతున్నారు. దీంతో మాంసం దుకాణాలన్నీ కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. అటు మటన్ ధరలు కూడా పండుగ తర్వాత తగ్గాయి. పండుగ సమయంలో రూ.1500 వరకు పలకగా.. ఇప్పుడు రూ.800కే లభిస్తోంది.






# వాట్సాప్ స్టేటస్ పెట్టుకొని యువకుడి బలవన్మరణం

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** భార్య కాపురానికి రావడం లేదని భర్త మద్యానికి బానిసయ్యాడు. తాను చనిపోతున్నానంటూ వాట్సాప్ స్టేటస్ పెట్టుకుని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుందని టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. చేర్యాల మండలం నాగపురికి చెందిన రెడ్డబోయిన కరుణాకర్(25) జనగామ జిల్లా బచ్చన్నపేట నాగిరెడ్డిపల్లికి చెందిన నందినితో ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. ఆటో డ్రైవరైన కరుణాకర్ మద్యానికి బానిసవగా,ఏడాది కిందట భార్య చిన్నకుమారుడితో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. కరుణాకర్ పెద్దకుమారుడు, తల్లితో సిద్దిపేటలోని బాలాజీనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆయన సోదరుడు అనారోగ్యానికి గురవగా, తల్లి, మనవడితో కలిసి నాగపురికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు.

## ఆరో వార్డు బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

**మక్తల్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మక్తల్ మున్సిపాలిటీలోని ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడంతో, రాష్ట్ర ఎన్నికల సంఘం (రాఇఅ) ఆ వార్డు ఎన్నికను వాయిదా వేసింది. రేపు జరగాల్సిన పోలింగ్ నిలిపివేయబడింది. మహదేవప్ప రాజకీయ ప్రత్యర్థుల వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సంఘం త్వరలో కొత్త తేదీని ప్రకటించనుంది.

## గ్యాస్ సిలిండర్ పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

**గద్వాల, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** అల్లంపూర్ లోని రాంపురం గ్రామానికి చెందిన 42 ఏళ్ల ఎండ్ మహమూద్ ఇంట్లో బీడీ అంటించుకోవడానికి వెళ్ళినప్పుడు గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వ్యక్తికి అత్యవసర వైద్యం అందించి, మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

## కరెంట్ షాక్ తో యువకుడి మృతి

**దేవరకద్ర, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన జామ్ రవి (22) మంగళవారం కరెంట్ షాక్ తో మృతి చెందాడు. జడ్చర్లలోని అరబిందో ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న రవి, ఇంట్లో హీటర్ ఆకస్మికంగా షార్ట్ సర్క్యూట్ కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రచయిత, జర్నలిస్టు రామకృష్ణారెడ్డికి సన్మానం




**వనపర్తి, ఫిబ్రవరి 10పెన్ పవర్:** వనపర్తి జిల్లా కేంద్రంలోని వద్దిరాంరెడ్డి కాలనీ నాగవరం రెడ్డి సేవా సమితి కళ్యాణ మండపంలో నేడు పలు రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న రెడ్డి సోదరులకు ప్రోత్సాహార్థక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రచయితగా, జర్నలిస్టుగా గుర్తింపు పొందుతున్న గంగవరం రామకృష్ణారెడ్డిని సన్మానించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కార్యదర్శి మెగా రెడ్డి ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డీటీహెచ్ రీఛార్జ్ పేరుతో రూ.2 లక్షలు మాయం

**జడ్చర్ల, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం, మిడ్జిల్ మండలానికి చెందిన ఎండి జాంగిర్ అనే వ్యక్తి డీటీహెచ్ రీఛార్జ్ కోసం గూగుల్లో కస్టమర్ కేర్ నంబర్ వెతకగా, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డాడు. వారి సూచనలతో ఫోన్ హ్యాక్ అయి, అకౌంట్ నుంచి రూ.2 లక్షలు పోయాయి. బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. గుర్తుతెలియని లింకులు, నంబర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంతనిఖీ చేసినకలెక్టర్



**సూర్యాపేట, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందితో సామాగ్రిపై అడిగి తెలుసుకుని, బ్యాలెట్ బాక్సులను పరిశీలించారు. ఎన్నికలను పారదర్శకంగా, నిబంధనల మేరకు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల తర్వాత పదవులు...

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులను భర్తీతో పాటు క్యాబినెట్ విస్తరణ చేయనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఆ తర్వాత నేతలకు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవులతో పాటు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలని భావిస్తున్నారట. అయితే కొందరు తమకు పదవులు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నారట.ఇంకొందరు అయితే తమకు పదవులు ఇవ్వకపోయినా సరే, కానీ వేరే పార్టీ నుంచి వచ్చిన వలస నేతలకు పోస్టులు ఇవ్వొద్దని అగ్రనేతలకు తేల్చి చెబుతున్నారట. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర స్టార్ట్ కానుందట.క్యాబినెట్‌లో మిగిలిన రెండు మంత్రి పదవులతో పాటు పలు కీలకమైన కార్పొరేషన్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోందట. మరోవైపు కులసంఘాల కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీపై కూడా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే మున్సిపల్ ఎన్నికల కోడ్ రావడంతో పదవుల భర్తీకి బ్రేకులు పడ్డట్లు చెప్పుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులు భర్తీ చేస్తామని చెబుతున్నారట ప్రభుత్వ పెద్దలు.క్యాబినెట్ బెర్తుల కోసం హస్తం పార్టీలో హెవీ కాంపిటేషన్ ఉంది. సామాజిక వర్గాల వారీగా అమాత్య యోగం కోసం పోటీ పడుతున్నారు నేతలు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి గట్టి పట్టుబడుతున్నారు.ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నారు. ఇంతలో సీఎం రేవంత్ రెడ్డి పరిగి సభలో చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని మున్సిపల్ శాఖ మంత్రిని చేస్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్ ఫ్లోలో అలా మాట్లాడారా లేక రంజిత్‌రెడ్డిని మంత్రి చేయబోతున్నారా అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.ఈ క్రమంలోనే వలస వచ్చిన నేతలకు కాకుండా..పార్టీలో ముందు నుంచి ఉన్నవారికి గతంలో హామీ ఇచ్చినవారికి అమాత్య పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వంటి వారు పోటీ పడుతున్నారు.ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం భర్తీ చేయాల్సిన కీలక పదవుల్లో మహిళా కమిషన్ ఒకటి. మహిళా కమిషన్ ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా..కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించిన మహిళలకే అవకాశం ఇవ్వాలని హస్తం పార్టీ మహిళా నేతలు కోరుతున్నారు. అయితే ఈ పదవిని ప్రస్తుత జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది గ్రేటర్ మేయర్ విజయలక్ష్మీ పదవీకాలం ముగుస్తుంది. ఆ త్వరాత ఎన్నికల కోడ్ ముగియగానే విజయలక్ష్మికి మహిళా కమిషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో కష్టపడిన తమను కాదని వేరే పార్టీలో పదవులు అనుభవించిన వారికి మహిళా కమిషన్ లాంటి కీలక పదవి ఇవ్వడం సరైన పద్ధతి కాదని పార్టీ పెద్దల దగ్గర గోడును వెళ్లబోసుకున్నారట.వాస్తవానికి ఇప్పటివరకు పనిచేసిన మహిళా కమిషన్ ఛైర్మన్ కేవలం ఏడాదిన్నర మాత్రమే పదవిలో కొనసాగారు. కమిషన్ పదవీకాలం ఐదేళ్లు కాగా.. మూడున్నరేళ్లు ఈ పదవిలో ఉన్న సునితా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో రాజీనామా చేశారు. దీంతో మిగిలిన ఏడాదిన్నర కోసమే నేరెళ్ల శారదకు అవకాశం ఇచ్చారు. ఏడాదిన్నర కాలం కూడా సమర్థవంతంగా పనిచేశారన్న పేరు కూడా తెచ్చుకున్నారు. దీంతో ఆమెకు ఎక్స్‌టెన్షన్ ఖాయమనే అంతా భావించారు.అయితే కేకే కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీ పదవీకాలం ఈ నెల ముగుస్తుండడంతో ఆమెకు మహిళా కమిషన్ ఛైర్మన్ పోస్టు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే ఇప్పటివరకు శారదకు ఎక్స్ టెన్షన్ ఇవ్వకుండా..కొత్త వారితో భర్తీ చేయకుండా ఆపారన్న టాక్ నడుస్తోంది. దీనిపై ఒరిజినల్ కాంగ్రెస్ మహిళా నేతల్లో అసహనం వ్యక్తం అవుతోంది.డిమాండ్లు, అభ్యంతరాలు, ఆశావహులు ఈక్వేషన్స్ ఎలా ఉన్నా..మార్చి ఫస్ట్ వీక్‌లో కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం మాత్రం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. అయితే పదవుల పందేరంలో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్ నేతల్లో ఎవరి ఆశలు నెరవెరుతాయో చూడాలి మరి.

# జనారణ్యంలోకి జంతువులు

**అదిలాబాద్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** దట్టమైన వృక్షాలు. ఆకాశాన్ని తాకే విధంగా కొండలు.. గలగల పారే సెలయేర్లు.. అందులో రకరకాల జంతువులు.. ఫలితంగా జీవావరణం అద్భుతంగా ఉండేది. ప్రకృతి సమతుల్యం గొప్పగా అనిపించేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే అభివృద్ధి వల్ల చెట్లు నేల కూలిపోయాయి. కొండలు కరిగిపోయాయి. సెలయేర్లు కాలగర్భంలో కలిసిపోయాయి.అడవిని నమ్ముకున్న జంతువులు ఒక్కొక్కటిగా చనిపోతున్నాయి. ఉన్న జంతువులు జనావాసాలాలో పడి కన్నుమూస్తున్నాయి. పెద్దపులి నుంచి మొదలు పెడితే జింకల వరకు ఇదే పరిస్థితి. కొన్ని సందర్భాలలో ఉన్న అడవుల్లో కూడా పులులకు ఆహారం దొరకడం లేదు. ఆహార అన్వేషణలో భాగంగా పులులు ఉన్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వస్తున్నాయి. ఆ సమయంలో ఆహారం లభించక.. ఆవాసం దొరకక నరకం చూస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి, జనగామ జిల్లాలలో మహారాష్ట్రలోని పాండవ ఖరా టైగర్ రిజర్వ్ నుంచి ఒక పులి వచ్చింది. ఈ పులి ముందుగా ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించి యాదాద్రి, జనగామ జిల్లాలలో ప్రవేశించింది. యాదాద్రి జిల్లాలోని కొలనుపాక ప్రాంతం నుంచి లింగాల గణపురం మండలం కుందారం గ్రామం శివారులోకి వచ్చింది. అక్కడ ఓ రైతుకు సంబంధించిన లేక దూడను చంపి తినేసింది. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో వారు పులి పాదముద్రలను పరిశీలించారు. అంతేకాదు ప్రజలకు సూచనలు చేశారు. రాత్రిపూట ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో పులి కనిపించక దాదాపు 50 సంవత్సరాలు దాటిపోయింది. గతంలో ఈ ప్రాంతాలలో అడవులు విస్తారంగా ఉండేవి. కానీ, క్రమక్రమంగా అడవులు తగ్గిపోవడంతో పులులు కనుమరుగైపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పులులకు కూడా సరైన ఆవాసం, ఆహారం లభించకపోవడంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. చివరికి ప్రాణాలు కోల్పోతున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి పరిస్థితి కూడా ఇలానే ఉంది. అది ఆహార అన్వేషణ కోసం.. మనుగడ కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉపయోగం ఉండడం లేదు.

# తగలబడిందా... తగలబెట్టేరా

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, పెన్ పవర్:** హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు.ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా , భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణం పై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.క్లూస్ టీమ్ , ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్కులు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం




ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.ం

# సాంకేతికత రంగంలో 'ఆమె'ను పాత్ర ఎక్కడా!

**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి అత్యాధునిక డిజిటల్-ఏఐ యుగంలో యువత అవకాశాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్తపుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చి వేశాయి. నేటి విద్యావంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నోక్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలోచనలతో సరి కొత్త ప్రపంచాన్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకులు మాత్రమే అధికంగా ఉండడం, మహిళలు/బాలికల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగవలసిన ప్రగతి నమోదు కావడంలేదు. ప్రకృతిలో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్-టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ఈ మధ్య కాలంలో సైన్స్ చదివే బాలికలు, యువతుల సంఖ్య కొంత వరకు పెరిగినా సాధించాల్సింది చాలా ఉందని గమనిస్తూ వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించడం అవసరం అని తెలుసుకోవాలి. ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేడమ్ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురాలు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపంచ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడానికి, నేటి బాలికలు/యువతులను సైన్స్ వైపు ఆకర్శించడానికి ఐరాస-యూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినోత్సవాన్ని" పాటించడం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు, తల్లితండ్రులు, పౌర సమాజం, శాస్త్ర సాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు/యువతుల దృష్టిని "స్టెమ్- ఎస్‌టిఈఎం"- సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమాటిక్స్ రంగాల వైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుందని ప్రచారం చేయడం జరగాలి. నేడు 33 శాస్త్రం మహిళా శాస్త్రజ్ఞులు, 35 శాతం బాలికలు/యువతులు స్టెమ్ రంగంలో కొనసాగుతున్నారని, దీనిని 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని పురుషాధిక్య సమాజం బేషరతుగా ఒప్పుకోవాలి. సైన్స్-టెక్నాలజీ (స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11 ఫిబ్రవరిన "సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం" నిర్వహిస్తున్నారు. 2026 నిర్వహిస్తున్న 'సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తంగా "సైన్స్-టెక్నాలజీ రంగా తలుపులు తెరిచి "ప్రణాళికలు ప్రభావం చూపడం : స్టెమ్ విద్యలో లింగ అసమానతల తగ్గింపు" అనే అంశాన్ని తీసుకొని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. 1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటి వరకు సైన్స్ రంగాల్లో 976

(28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25 మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం. మెడిసిన్ రంగ నోబెల్ బహుమతుల్లో 5.6 శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8 శాతం మహిళలు మాత్రమే ఉండడం సోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి. నేటి పౌర సమాజం, ముఖ్యంగా

పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్‌కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్-టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరిపేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగడం చూద్దాం. సైన్స్-టెక్నాలజీ రంగాలకు బాలికలు, యువతులను ఆకర్షిస్తూ, తగు స్కాలర్‌షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో 'ఆమె' మేధో సంపత్తిని పెట్టుబడిగా పెడదాం.

# మున్సిపల్స్ కు అంతా రెడీ
# బరిలో 12,930 మంది అభ్యర్థులు

## మరి కొద్ది గంటల్లో పోలింగ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎటువైపు ఉండనుందో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తంకానుంది. గత పది రోజులుగా హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. బుధవారం పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం సోమవారం సాయంత్రం అయిదు గంటలకు అధికారికంగా ప్రచారం ముగిసింది. రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లోని 2,982 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. మరో 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,930 మంది తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీ సైతం అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలపకపోవడం విశేషం. ఈ ఎన్నికల్లో మరో విశేషం సైతం నమోదైంది. మొత్తం అభ్యర్థుల్లో మహిళా అభ్యర్థులే అధిక సంఖ్యలో ఉన్నారు. మొత్తం 12,930 మందిలో పురుషులు 6,434 (49.76 శాతం) మంది కాగా, మహిళలు 6,496 (50.24 శాతం) మంది.

అత్యధికంగా కరీంనగర్‌లో అభ్యర్థులు
అత్యధికంగా కార్పొరేషన్లలో కరీంనగర్‌లో మొత్తం 66 డివిజన్లకు గాను 398 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మున్సిపాలిటీలలో ఆదిలాబాద్‌లో 49 వార్డులకు గాను 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 34 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు.
పార్టీల వారీగా చూస్తే..
అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ 2,948 (98.3 శాతం) స్థానాల్లో, బీఆర్ఎస్ 2,878 (96 శాతం) స్థానాల్లో, బీజేపీ 2,634 (87.3 శాతం) స్థానాల్లో పోటీలో నిలిచాయి. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు 2,786 (94 శాతం) స్థానాల్లో బరిలో నిలిచారు. జనసేన పార్టీ 332 (11.1 శాతం) స్థానాల్లో, మజ్లిస్ పార్టీ 282 (9.4 శాతం) స్థానాల్లో, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288 (9.6 శాతం) స్థానాల్లో, బీఎస్పీ 213 (7.3 శాతం) స్థానాల్లో, సీపీఐ 168 (5.6 శాతం) స్థానాల్లో, సీపీఎం 108 (4.2 శాతం) స్థానాల్లో, ఆప్ 38 (1.2 శాతం) స్థానాల్లో, ఐయూఎంఎల్ తొమ్మిది (0.3 శాతం) స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో దింపాయి. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీల నుంచి పలువురు నామినేషన్లు వేసినప్పటికీ, బీఫారాలు సమర్పించకపోవడంతో అవి తిరస్కరణకు గురయ్యాయి. మరోవైపు ఖమ్మం జిల్లాలో టీడీపీ అభ్యర్థులు ఇతర పార్టీల గుర్తులపై పోటీ చేస్తున్నారు.
ఏకగ్రీవమైనవి ఇవే..
మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 58వ డివిజన్‌లో రమాదేవి, రామగుండం కార్పొరేషన్‌లోని ఒకటో డివిజన్‌లో మాడిపల్లి విజయ, చౌటుప్పల్‌లో చింత ఉమామహేశ్వరి (17వవార్డు), హాలియాలో పిల్లి చంద్రకళ(10), ఎదులాపురంలో తమ్మినేని మంగతాయి(15), హుజూర్‌నగర్‌లో నాగలక్ష్మి(3), కోదాడలో దేవరపల్లి మల్లేశ్వరి(11), వై.కుసుమకుమారి(31), కట్టెబోయిన జ్యోతి(21), మెదక్‌లో గౌడల మానస(32), వికారాబాద్‌లో అనంతరెడ్డి(1), యాదగిరిగుట్టలో గుండిపల్లి వాణి (10) కాంగ్రెస్ పార్టీ తరపున, అలంపూర్‌లో విక్రం(10), వికారాబాద్‌లో విజయలక్ష్మి (15వ వార్డు) బీఆర్ఎస్ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
పోటీలో 775 పోస్ట్ గ్రాడ్యుయేట్లు..
మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న మొత్తం అభ్యర్థుల్లో 775 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉండడం గమనార్హం. గ్రాడ్యుయేట్లు 2,903 మంది, అండర్ గ్రాడ్యుయేట్లు 7,917 మంది కాగా, నిరక్షరాస్యులు 1,291 మంది.

## మున్సిపల్ ఎన్నికల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** జిల్లాలోని మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న 208 మందిని గుర్తించి, 123 కేసులు నమోదు చేసి, ముందస్తుగా బైండోవర్ చేశారు. మద్యం అక్రమ రవాణాపై 30 కేసుల్లో రూ. 1.57 లక్షల విలువైన 249 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు.

## చిరుత తిరుగుతోంది.. అప్రమత్తంగా ఉండండి

**సంగారెడ్డి, ఫిబ్రవరి 10పెన్ పవర్:** అల్లాదుర్గం మండలం లో చిరుత సంచారం కలకలం రేపింది. అకోలా-హైదరాబాద్ 161 జాతీయ రహదారి పక్కన అల్లాదుర్గం మండలం ఐబీ చౌరస్తా సమీపంలో సర్వీసు దారిలో తిరుగుతుండగా పలువురికి కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన తహసీల్దారు మల్లయ్యలు ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ గాలయ్యలు.. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గొల్లకుంట తండా, గాండ్లబాయి తండా, మాందాపూర్, చిల్వేర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు.

## తెలంగాణ డీజీపీ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ నాయకులు

**ఖైరతాబాద్, ఫిబ్రవరి 10పెన్ పవర్:** తెలంగాణ డీజీపీ కార్యాలయాన్ని బీజేపీ నాయకులు ముట్టడించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మక్తల్ మున్సిపాలిటీ ఆరో వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ కారణమని ఆరోపిస్తూ బీజేపీ ఆందోళన చేపట్టింది. ఈ క్రమంలో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో డీసీపీ శిల్పవల్లి కిందపడిపోయారు. ఘటనాస్థలి వద్ద భారీగా పోలీసులు మోహరించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

# కోర్టుకు నరవణె

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10, పెన్ పవర్:**
భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ (ఎంఎం) నరవణే రాసిన పుస్తకం ఇంకా అధికారికంగా విడుదల కాకముందే వివాదంలో చిక్కుకుంది. ఆయన రాసిన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలోని అంశాలు, పీడీఎఫ్ కాపీలు చట్టవిరుద్ధంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జనరల్ నరవణే తన అనుభవాలను పొందుపరుస్తూ రాసిన ఈ పుస్తకం ప్రస్తుతం రక్షణ శాఖ, విదేశాంగ శాఖల అనుమతి కోసం వేచి ఉంది. ఇందులో అగ్నిపథ్ స్కీమ్, తూర్పు లడఖ్‌లో చైనాతో ప్రతిష్టంభన వంటి కీలకమైన అంశాలను నరవణే ప్రస్తావించినట్లు సమాచారం. అయితే, పుస్తకం ప్రచురణకు నోచుకోకముందే, అందులోని కొన్ని భాగాలు ఫోటోల రూపంలోనూ, పీడీఎఫ్ రూపంలోనూ వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అనుమతి లేకుండా, ప్రచురణ కాకుండానే పుస్తకాన్ని లీక్ చేయడం, కాపీరైట్ ఉల్లంఘన కింద పరిగణించబడుతుంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పుస్తకంలోని కంటెంట్‌ను ఎవరు లీక్ చేశారు? ఎక్కడి నుంచి ఇది మొదలైంది? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా ఈ పుస్తకాన్ని ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. ఆమోదం కోసం వేచి ఉన్న ఈ పుస్తకానికి సంబంధించిన విషయాలను అనధికారికంగా ప్రసారం చేయడమనే ఉల్లంఘన ఇందులో ఉంది కాబట్టి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాపీరైట్ ఉల్లంఘనలు, అక్రమ పంపిణీ లేదా ఇతర లోపాలు జరిగే అవకాశం దర్యాప్తులో భాగంగా ఉంటుంది. ఈ సమస్య సున్నితత్వం దృష్ట్యా, అధికారిక కేసు నమోదు చేసి, దర్యాప్తును ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగానికి అప్పగించారు. లీక్ మూలం, అందుకు గల బాధ్యులు, ఎలా బయటకు వచ్చిందో దర్యాప్తు బృందాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తాయి. దర్యాప్తు వెల్లడైన వివరాలు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నరవణే పుస్తకంలో అంశాన్ని మొదటిసారి లేవనెత్తారు. స్పీకర్ అభ్యంతరం వ్యక్తంచేయడంతో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. భారత్-చైనా సరిహద్దు వివాదానికి సంబంధించిన ప్రస్తావన అందులో ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశం తీవ్ర రాజకీయ దుమారానికి కేంద్ర బిందువుగా మారడంతో లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం లేకుండానే ఆమోదం పొందింది. అయితే, విపక్ష ఎంపీలు మోదీపై దాడి చేస్తారనే తనకు సమాచారం ఉండటంతో ప్రధానిని తాను సభకు రావద్దని కోరినట్టు స్పీకర్ ఓం బిర్లా చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తాయి. సాధారణంగా ఆర్మీ చీఫ్‌లు పదవీ విరమణ తర్వాత రాసే పుస్తకాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశాలు బహిర్గతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిబంధన ఉంది. నరవణే పుస్తకంలో 2020 గల్వాన్ ఘర్షణలు, అగ్నిపథ్ నియామక ప్రక్రియపై సంచలన విషయాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. ప్రభుత్వం దీనిని సమీక్షిస్తుండగానే, ఈ లీక్ జరగడం గమనార్హం.

## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

**ఇల్లందు, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** ఇల్లందు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కోసం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, బ్యాలెట్ బాక్సులను సిబ్బందికి అందజేశారు. ఇల్లందు మునిసిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉండగా, 108 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

## గిరిజన గ్రామ పంచాయతీలో పర్యటించిన ఎంపీడీవో

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** రానున్న ఎండాకాలం దృష్ట్యా, మనుబోతులపాడు గ్రామపంచాయతీలో మంగళవారం ఎంపీడీవో ముత్యాలరావు పర్యటించారు. మారుమూల గిరిజన గ్రామమైన ఇక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. అలాగే, ఉపాధి హామీ పనులకు కూలీలు రావాలని, పంచాయతీ నర్సరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## అన్నపురెడ్డిపల్లిలో లక్ష మందితో మల్లన్న మహాజాతర

**భద్రాచలం, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు మహాజాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో రమణ, ఛైర్మన్ నర్సింహారావు మంగళవారం ప్రచారం చేపట్టారు. 15వ తేదీన స్వామివారి కల్యాణం వైభవంగా జరగనుంది. సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తూ, తాగునీరు, క్యూలైన్లతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

## బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యపై కాంగ్రెస్ నేత రాజనాల శ్రీహరి విమర్శలు



**జనగామ, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** బీజేపీ మక్తల్ అభ్యర్థి మహదేవ్ ఆత్మహత్యపై గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సంఘటనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ రాజకీయ కోణంలో దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏమీ లేనట్లుగా కిషన్ రెడ్డి పార్లమెంటులో ఈ విషయాన్ని లేవనెత్తారని, దీనికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ఈ మొత్తం వ్యవహారానికి టిఆర్ఎస్, బిజెపి పార్టీలే బాధ్యత వహించాలని రాజనాల శ్రీహరి పేర్కొన్నారు.

## కేటీఆర్ నర్సంపేట ఎన్నికల ప్రచారంలో పాల్గొని, బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు

**పాలకుర్తి, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** బీఆరెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ నర్సంపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన 25వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి నాడెం సునీతకు మద్దతు తెలిపారు. ఈ ప్రచారంలో బీఆరెస్ సీనియర్ నాయకురాలు డా.హరి రమాదేవి కూడా సునీతకు మద్దతుగా నిలిచారు. నర్సంపేట నియోజకవర్గంలో ఈ ఎన్నికల ప్రచారం జరిగింది.

## వేయి స్తంభాల ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన నాయిని రాజేందర్ రెడ్డి

**స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 1 పెన్ పవర్:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పోస్టర్ కరపత్రాన్ని కూడా ఆయన విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల కవాతు

**పరకాల, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో బుధవారం జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, మంగళవారం పోలీసులు పట్టణంలో కవాతు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పట్టణ ప్రధాన వీధుల్లో నిర్వహించిన ఈ కవాతు ద్వారా ప్రజల్లో భద్రతపై అవగాహన కల్పించారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు: ఎమ్మెల్యే నాయిని

**మహబూబాబాద్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** హనుమకొండ జిల్లాలోని వేయి స్తంభాల ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 14 నుంచి 18 వరకు జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సదుపాయం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, చలువ పందిళ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల భద్రత కోసం పోలీస్ యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## న్యాల్కల్ లో పశు వైద్య సంరక్షణ కార్యక్రమం:



**జహీరాబాద్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** న్యాల్కల్ మండలం రామతీర్థం గ్రామంలో పశు వైద్య సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్యుడు డాక్టర్ గణేష్ పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించి, రైతులకు సంరక్షణపై సూచనలు చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మమ్మ మాట్లాడుతూ, పశువుల ఆరోగ్యం మెరుగుపడితే రైతుల ఆర్థిక స్థితి బలపడుతుందని, ఇలాంటి కార్యక్రమాలు తరచుగా జరగాలని తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలు పొందారు.

## గర్భిణీకి అంబులెన్స్‌లో సుఖ ప్రసవం తల్లీ బిడ్డా క్షేమం



**చెన్నూరు, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** కొమురం భీం జిల్లా తిర్యాని మండలం పంగిడి గ్రామానికి చెందిన 30 ఏళ్ల గర్భిణీ మదారి భీమ్ భాయ్‌కి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ఆమె 7 నెలల గర్భవతి అని గుర్తించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు తీవ్రమవడంతో, అంబులెన్స్‌ను పక్కకు నిలిపి, ఈఎంటి సురేష్, పైలట్ దినేష్ సహాయంతో సుఖ ప్రసవం చేయించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. మెరుగైన వైద్యం కోసం వారిని తిర్యాని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## నగదు, మద్యం పట్టివేత

**మంచిర్యాల, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** చెన్నూర్ మున్సిపాలిటీలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి గుర్రం ఉమాదేవి అనుచరుడు పడమటింటి శ్రీనివాస్ నుంచి రూ. లక్షన్నర నగదును, 12వ వార్డు బిజెపి అభ్యర్థి అడుప రేణుకా దేవి అనుచరుడు రాపర్తి కిరణ్ వద్ద నుంచి 94 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు సిఐ బన్సీలాల్ తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై సుబ్బారావు, ఏవో యామిని, పోలీసులు విచారణ చేపట్టారు.

## 165 గ్రాముల గంజాయి పట్టివేత

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడి బజార్ ఏరియాలో గల శివాలయం రోడ్ లో మహమ్మద్ సమీరుద్దీన్ అనే వ్యక్తి వద్ద 160 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం, నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి రవాణా చేసినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయ ప్రారంభం

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయాన్ని (హనుమాన్ మందిరం) ఆసిఫాబాద్ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి గారు ఘనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం దేవాలయం కేంద్రంగా భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం విస్తరించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అజయ్ కుమార్, మాజీ సింగిల్ విండో చైర్మన్ జాబరి పేంటు, సరండి సర్పంచ్ మోర్లే బాపూజీ, గ్రామ పటేల్ కొట్రంగే మెంగాజీ, మాలి సంఘం జిల్లా అధ్యక్షులు శిండే వాసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, గౌరయ్య పటేల్, మాజీ సర్పంచ్ దుర్గం కమలాకర్ తో పాటు గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభ్యర్థుల పనితీరుపై ఓటర్ల ఫోకస్

**సిర్పూర్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** ఆసిఫాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. వార్డుల వారీగా గెలుపోటములపై అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈసారి ఓటర్లు పార్టీ కంటే అభ్యర్థుల వ్యక్తిగత సమర్థతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. అభ్యర్థి గత చరిత్ర, గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటారా?, వార్డు సమస్యలపై పోరాడే తత్వం ఉందా? అనే అంశాలపై యువత, విద్యావంతులు చర్చిస్తున్నారు. ఇది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

## శ్రీమద్భాగవత సప్తాహ కథా యజ్ఞంలో పాల్గొన్న మంత్రి



**ధర్మపురి, ఫిబ్రవరి 10( పెన్ పవర్:** ధర్మపురి పట్టణంలో ఫిబ్రవరి 5 నుండి 11 వరకు జరుగుతున్న శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం పాల్గొన్నారు. ఆయన బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ చేస్తున్న ప్రవచనాలను ఆలకించి, అనంతరం ఆయన ఆశీస్సులు అందుకున్నారు.

## ఎన్నికల నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి

**జగిత్యాల, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా కేంద్రంలోని బిఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీలు రఘు చందర్, సిఐలు కరుణాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

## జగిత్యాలలో అరుదైన ఆపరేషన్

**కోరుట్ల, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** జగిత్యాల మాతా శిశు కేంద్రంలో వైద్యులు అరుదైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించారు. కడుపు నొప్పితో వచ్చిన ఒక మహిళను పరీక్షించిన వైద్యులు అరుణ, మాధవిలు సుమారు 4 గంటల పాటు శ్రమించి, 36 వారాల గర్భిణీ పరిమాణంలో ఉన్న కణితిని తొలగించి ఆమె ప్రాణాలను కాపాడారు. ఈ అద్భుతమైన వైద్య సేవలపై మహిళ కుటుంబ సభ్యులు వైద్యులను, ఆసుపత్రి సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందించారు.

## మంత్రికి తీర్థ ప్రసాదాలు అందించిన ఆలయ పాలకవర్గం

**పెద్దపల్లి, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ లను మంగళవారం బీర్పూర్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ఆలయ పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాజీ కేడిసిసి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ: అభినందించిన కలెక్టర్

**రామగుండం, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఫిబ్రవరి 8న వేములవాడలో జరిగిన ఈ పోటీలలో జూలపల్లి మండలం పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. వీరిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ లో ప్రత్యేకంగా అభినందించారు.

## దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి..

**మంథని, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మె విజయవంతం కోసం రామగుండం-3 ఏరియాలో మంగళవారం కార్మిక సంఘాలన్నీ జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు వైవీ రావు, రవీందర్ రెడ్డి, నాగేల్లి సాంబయ్య, కొమురయ్యలు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్‌బినగర్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్ పరిధిలోని హయత్‌నగర్ డివిజన్ మిదాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కు ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను కూడా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులను ప్రారంభించడం ద్వారా స్థానిక ప్రజల సౌకర్యార్థం మెరుగైన వసతులు కల్పించబడ్డాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** తరిమెల నాగిరెడ్డి (ఫిబ్రవరి 11, 1917- జులై 28, 1976) అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. ఆయనను అందరూ టి.ఎన్ అని పిలిచేవారు. అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో ఫిబ్రవరి 11, 1917 న రైతు కుటుంబములో జన్మించారు. పాఠశాల రోజుల నుండే సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా తిరుగుబాటు లక్షణాలు కనబరిచారు. మద్రాసు లోని లయోలా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివేరోజుల్లో తన జాతీయతా భావాల కారణంగా కళాశాల యాజామాన్యానికి, ఆచార్యులతో నాగిరెడ్డికి పొసగ లేదు. లయోలా కళాశాల యాజమాన్యం నాగిరెడ్డికి జవహర్ లాల్ నెహ్రూ బహిరంగ ఉపన్యాసాలకు హాజరైనందుకూ, రామస్వామి ముదలి యారుకు, సత్యమూర్తికి మధ్య జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు, వ్యాసరచనా పోటీలలో మహమ్మద్ బిన్ తుగ్లక్‌ను ప్రశంసించినందుకు, అనేకసార్లు జరిమానా విధించింది. నాగిరెడ్డి లయోలా కళాశాల తరువాత వారణాసి, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో విద్య నభ్యసించారు. వారణాసిలో ఉన్న నాలుగేళ్ళలో నాగిరెడ్డి కమలాదేవి ఛటోపాధ్యాయ, జయప్రకాశ్ నారాయణ్,అచ్యుత్ పట్వర్ధన్ వంటి వారిచే ప్రభావితు డయ్యారు. కమ్యూనిజం, మార్క్సిజంతో ఈయనకు వారణాసిలోనే పరిచయ మయ్యింది. రష్యన్ విప్లవము, స్టాలిన్ నాయకత్వం గురించి విస్తృతముగా చదివి, భారత దేశశంలో కూడా మార్క్సిజాన్ని అమలు చేయవచ్చని నమ్మటం ప్రారంభించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఉపకులపతిని నిలదీశారు. మహాత్మా గాంధీకి అది తెలిసి తరిమెల నాగిరెడ్డి వైస్ ఛాన్సలర్‌కి క్షమాపణలు చెప్పాలని ఉత్తరం రాశారు. నాగిరెడ్డి అందుకు ఒప్పుకోలేదు. తిరస్కరించారు.నాగిరెడ్డి తన ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ కలాపల వల్ల అనేకమార్లు జైలుకు వెళ్లారి. 1940లో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం అన్న పుస్తకం వ్రాసి ప్రభుత్వము యొక్క ఆగ్రహానికి గురై జైలుకు వెళ్ళారు. తిరుచిరా పల్లి జైలునుండి విడుదల కాగానే తిరిగి 1941లో భారతీయ రక్షణ చట్టము కింద అరెస్టయ్యారు. 1946లో ప్రకాశం ఆర్డినెన్సు కింద అరెస్టయ్యి 1947లో విడుదల చేయబడ్డారు. 1952లో నాగిరెడ్డి మద్రాసు శాసన సభకు సి.పి.ఐ అభ్యర్థిగా అనంతపురం నియోజక వర్గం నుండి ఎన్నికయ్యారు. జైలులో ఉండి కూడా, ప్రముఖ కాంగ్రెస్ కాంగ్రెసు నాయకులు, తన బావ అయిన నీలం సంజీవరెడ్డిపై విజయం సాధించి సంచలనం సృష్టించిన ఘనత ఆయనకే దక్కింది. 1955లో కొత్తగా ఏర్పడిన పుట్లూరు నియోజక వర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి తరిమెల రామచంద్రారెడ్డి చేతిలో ఓడిపోయారు. 1957లో అనంతపురం లోక్‌సభ నియోజక వర్గం నుండి 2వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. తిరిగి 1962లో పుట్లూరు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సి.పి.ఐ అభ్యర్థిగా పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డి ఓడించి ఎన్నికైనారు. 1967లో నియోజక వర్గాల పునర్విభజనలో పుట్లూరు నియోజకవర్గం రద్దుకాగా, సి.పి.ఐ (ఎం) అభ్యర్థిగా అనంతపురం నియోజకవర్గం నుండి మూడో సారి శాసనసభకు ఎన్నికయ్యారు. 1969లో మార్చి నెలలో శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. నాగిరెడ్డి రచనలలో ముఖ్యమైనది ఇండియా మార్ట్‌గేజ్‌డ్ (తాకట్టులో భారతదేశం). 1968లో నాగిరెడ్డి సి.పి.ఐ (ఎం) నుండి విడిపోయి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రెవల్యూషనరీస్ (ఏ.పి.సి.సి.ఆర్) - ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీని స్థాపించారు. సి.పి.ఐ (ఎం) కార్యకర్తలను కొత్తపార్టీలోకి ఆకర్షించడంలో సఫలం అయ్యారు. కొద్దికాలం ఏ.పి.సి.సి.ఆర్ అఖిల భారత కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీలో కలసివుంది. రెడ్డి 1976లో తను మరణించేదాకా ఏ.పి.సి.సి.ఆర్ నాయకునిగా కొనసాగారు. నాగిరెడ్డి 1976, జులై 28న మరణించారు.

# ఏకాత్మతా మానవవాద సిద్ధాంత కర్త దీన్‌దయాళ్

**హైదరాబాద్ పెన్ పవర్:** కొందరు మరణించేవరకు జీవిస్తారు, కొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారు. రెండవ కోవకు చెందిన వారు పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ. అతి సామాన్య కుటుంబంలో జన్మించి అసామాన్య వ్యక్తిగా ఎదిగారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబర్ 25న ఉత్తరప్రదేశ్‌లోని మధుర దగ్గర 'నగ్ల చంద్రభాన్' అనే గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లి, తండ్రి మరణించిన దీనదయాళ్ జీ మేనమామ ఇంటిలో పెరిగారు. 1925 ప్రాథమిక విద్యకు శ్రీకారం చుట్టిన దయాళ్ కాన్పూర్‌లో బి.ఎ, చదువు తున్నప్పుడు ఆర్ఎస్ఎస్‌తో పరిచయం ఏర్పడింది. 1937లో మొదటి కొద్దిమంది స్వయం సేవకులలో ఒకరిగా చేరి ప్రాదేశిక సహ ప్రచారక్ స్థాయికి ఎదిగారు. అప్పటి నుండి ఆయన జీవిత విధానం, గమ్యం మారిపోయింది. సంఘ్‌లో పనిచేస్తూనే బి.ఎ, డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ ఎంఎ, ప్రథమ సంవత్సరం పూర్తిచేశారు. సంఘ్ విస్తరణకు పూర్తి సమయం ఇచ్చేందుకు చదువుకు స్వస్తి పలికారు. ఉత్తర ప్రదేశ్‌లోని లభంపూర్ ప్రాంతానికి ప్రచారకులుగా నియుక్తులైన కొద్ది సంవత్సరాల లోనే ఆ ప్రాంతంలో సంఘ్ కార్యక్రమాలను వికసింప జేశారు. అది గమనించిన సంఘ్ పెద్దలు వారిని ఉత్తరప్రదేశ్ ప్రాంత సహ ప్రచారకులుగా నియమించారు. ఆయన అసామాన్యమైన ప్రతిభా పాటవాలు అందరినీ ఆకట్టు కున్నాయి. సంఘ్ కార్యక్రమాలు చూస్తూనే పత్రికారంగంపై దృష్టి సారించి రాష్ట్ర ధర్మ ప్రకాశన్ అనే సంస్థ ఏర్పాటు చేశారు. ఆ ప్రకాశన్ ద్వారా "రాష్ట్ర ధర్మ", అనే ఒక మాస పత్రిక, "పాంచజన్య" అనే వారపత్రిక, "స్వదేశ్" అనే దిన పత్రిక ప్రారంభించారు. ఆ పత్రికలు దీనదయాళ్ జీ కార్యదీక్షకు ప్రతీకలుగా నిలిచాయి. 1952లో భారతీయ జన సంఘ్ లో చేరి ఉపాధ్యక్షులుగా నియమితుడైనారు. 1967లో జన సంఘ్ అధ్యక్ష పదవి చేపట్టేవరకు ఆ పదవిలో కొన సాగారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణించాక, పార్టీ బాధ్యతలు భుజాన వేసుకొని విజయ పథంలో నడిపించారు. అలాగే ఆర్.ఎస్.ఎస్ వారపత్రిక పాంచజన్య, లక్నో దినపత్రిక 'స్వదేశ్'లకు సంపాదకులుగా వ్యవహరించారు. భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంతానికి పునాదిగా చెప్పబడే ఏకాత్మతా మానవతా వాదం, శంకరాచార్య జీవిత చరిత్ర వంటి పుస్తకాలు, హిందీలో 'చంద్రగుప్త మౌర్య' నాటకం, మరాఠీ నుండి ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులు డా. హెడ్గేవార్ జీవిత చరిత్ర అనువాదం వంటి పలు రచనలు చేశారు. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు ఉన్నాయని వివరించే క్రమంలో "ఏకాత్మతా మానవతా వాదం" అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించారు. గాంధీజీని కాల్చి చంపిన నేరాన్ని హిందూ మహాసభతో పాటు ఆర్ఎస్ఎస్ పై కూడా మోపిన నేపథ్యంలో, ఆనాటి ప్రధాని నెహ్రూజీ సంఘ్‌ను నిషేధించారు. ఆ నిషేధాన్ని తొలగించాలంటూ జరిగిన ఉద్యమానికి ఉత్తర ప్రదేశ్‌లో దీనదయాళ్ జీ నిర్వహించిన పాత్ర గణనీయమైంది. ఈ హత్యానేరంలో సంఘ్ పాత్ర లేదని దీనదయాళ్ జీ పాంచజన్యలో స్పష్టం చేస్తూ ప్రభుత్వ అణచివేత విధానాలకు వ్యతిరేకంగా రాసిన రాతలకు ఆనాటి ప్రభుత్వం పాంచజన్యను నిషేధించింది. దానికి బదులుగా "హిమాలయ" అనే మరో వార పత్రికను ప్రారంభించి తన కలంతో నాటి ప్రభుత్వానికి కలవరం పుట్టించారు. ఈలోగా గాంధీజీ హత్యా నేరంలో ఆర్ఎస్ఎస్ పాత్ర లేదని భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జాతి, జాతీయత, భారతీయ సంస్కృతి, ధర్మం మొదలైన విషయాలపై ఆయనలోని అభిప్రాయాలు, మౌలిక సిద్ధాంతాలు తదితరాలపై ఆయన రచనా వ్యాసంగం కొనసాగింది. నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ విధానాలు, భారతీయ తత్వజ్ఞాన సారాన్ని దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి సామ్రాట్, చంద్రగుప్త, జగద్గురు శంకరాచార్య అనే చారిత్రక నవలలను కూడా దయాళ్‌జీ రాశారు. 1951లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రధాని నెహ్రూ విధానాలకు నిరసనగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి బయటికి వచ్చారు. ఆనాడు దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి నెహ్రూ అనుసరిస్తున్న, ముస్లిం సంతుష్టీ కరణ, హిందూ ధర్మ వ్యతిరేక విధానాలను ఎదుర్కొనడానికి, భారతీయ సంస్కృతి సభ్యులతో, జాతీయ భావాలతో కూడుకున్న రాజకీయ పార్టీని స్థాపించాలనే ఉద్దేశంతో ఆనాటి ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ గురూజీ సహాయాన్ని అర్థించారు. ఆయన కోరిక ప్రకారంగా పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ జీ, జగన్నాథరావు జీ, సుందర్ సింగ్ భాండారి లాంటి మరి కొందరు యువకులను అప్పగించారు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1951 అక్టోబరు 21న ఏర్పాటు చేసిన జనసంఘ్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా దీనదయాళ్ జీ ఎన్నికైనారు. పార్టీ స్థాపించిన మూడు మాసాలకే 1952లో జరిగిన జనరల్ ఎన్నికలలో పోటీ చేసిన నాలుగు జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటిగా జనసంఘ్ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందింది. తన ఉనికిని సాధారణ ఎన్నికలలో రుజువు చేసుకో గలిగింది. దీనికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నాయకత్వంతో పాటు దీనదయాళ్ జీ సమన్వయ కౌశలం కూడా తోడైంది. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మరణం తర్వాత జనసంఘ్ నామరూపాలు లేకుండా పోతుందని ఆశించిన వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ పార్టీని దేశవ్యాప్తంగా పటిష్ఠ పరచిన ఘనత దీనదయాళ్‌జీకి ఆయన సహచరులకు దక్కుతుంది. భారతీయ జనసంఘ్‌కు సిద్ధాంతాలు లేవన్నవారికి సవాలు విసురుతూ, ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అట్టడుగున పడివున్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని అందులో వాదించాడు. భారతీయ జనసంఘ్ అఖిల భారత కార్యదర్శిగా ఎక్కువ కాలం పనిచేసిన దీనదయాళ్‌జీ కార్యకర్తల హృదయాలను మలిచి వారి మనస్సులలో అతి స్థిర స్థానాన్ని చూరగొన్నారు. సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవిచూస్తూ దేశ సేవ నిమగ్నమై దానినే జీవన కార్యంగా స్వీకరించాడు. జనసంఘ్‌లో చేరినప్పటి నుంచి మహారథియై పార్టీకి సారథ్యం వహించి, దేశ రాజకీయాలలో జనసంఘ్‌కు ప్రత్యేక స్థానాన్ని కల్పించడంలో కృతకృత్యులై 1967లో పార్టీ అఖిల భారత అధ్యక్షుడు కాగలిగారు. కాలికట్‌లో జరిగిన అఖిల భారత జనసంఘ్ మహాసభలో భారత దర్శనాన్ని ప్రదర్శింపచేసి విశేష కీర్తి నార్జించారు. ఆ కీర్తియే జనసంఘ్ సిద్ధాంత వ్యతిరేకుల కినుకకు కారణమైంది. రాజకీయాలకు చిత్తశుద్ధి గల నేత బలి అయినారు. ఉత్తర ప్రదేశ్‌లోని మొగల్ సరాయి రైల్వే స్టేషన్‌లో 1968 ఫిబ్రవరి 11న రైలు పట్టాల వద్ద శవమై కనిపించారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ మరణం మాదిరిగానే దీనదయాళ్‌జీ మరణం కూడా పలు అనుమానాలకు దారితీసింది.ం

## ఉప్పల్‌లో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన

**ఉప్పల్, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు ఫిబ్రవరి 10, 2026న శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహీంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న పనులను నిర్దిష్ట కాలంలో పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థి గౌతమ్ సీపీఐలో చేరిక: ధనలక్ష్మికి మద్దతు



**కొత్తగూడెం, ఫిబ్రవరి 10 పెన్ పవర్:** కొత్తగూడెం జిల్లా, కార్పొరేషన్ 24వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన సురుగు గౌతమ్, మంగళవారం ఉదయం సాంబశివరావు, షబీర్ పాషా, దుర్గరాశి వెంకన్నల సమక్షంలో సీపీఐలో చేరారు. 24వ డివిజన్‌లో సీపీఐ అభ్యర్థి పోలమూరీ ధనలక్ష్మికి తన మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# థామస్ ఎడిసన్ ఆవిష్కరణల వెనక తల్లి పాత్ర

నూతన ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ (1847, ఫిబ్రవరి 11, 1931 అక్టోబర్ 18) జీవితంలో ఎన్నో ఆవిష్కరణలు గావించాడు. ఆయన అసమాన కృషి వెనక కన్న తల్లి పాత్ర గురించి తెలిస్తే ఆశ్చర్యం కలుగమానదు. ఎడిసన్ బాల్యంలో ఆయన తల్లి నిజాన్ని దాచి, ముద్దుల కుమారునికి ఇచ్చిన స్ఫూర్తి ఆయనకు తెలియ కుండానే ప్రపంచంలో ఒక గొప్ప శాస్త్రవేత్తను చేయడానికి ఉపకరిం చింది. ఎడిసన్ పాఠశాల నుండి ఒక రోజు ఇంటికి వచ్చి, తనకు స్కూల్లో ఇచ్చిన ఒక లెటర్ ను తల్లికి ఇచ్చి... దానిని స్కూలు లో తనకు ఇచ్చారని, తల్లికి ఇమ్మనన్నారని చెప్పి, దానిలో ఏముందో చదవి వినిపించ మన్నాడు. తల్లి ఆ లెటర్‌ను తెరిచి, చదువుతూ కళ్ళ నీళ్ళ పర్యంత మయింది. తన కుమారుడిని అక్కున చేర్చుకొని ఏడ్చింది. విషయం అర్థం కాని థామస్.. లెటర్ లో ఏముందని అడిగాడు. ఆమె ఆ లెటర్‌ను పట్టుకుని బిగ్గరగా చదువుతూ... "మీ కుమారుడు ఒక జీనియస్, అద్భుతమైన తెలివి తేటలు కలిగినవాడు , అయితే మేము ఇటువంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేము, ఇక్కడ థామస్‌కు చదువు చెప్పడానికి సరైన ఉపాధ్యాయులు లేక పోవడమే దానికి కారణం. అందుకే థామస్‌కు మీరు ఇంట్లోనే చదువు చెప్పండి" అని రాశారు అంటూ ఆమె చదివి చెప్పింది.నాటి నుండి థామస్ ఇంట్లోనే తన తల్లి వద్ద చదువుకోగా... తల్లి థామస్ చదువుపై అపార శ్రద్ధ పెట్టి ఒక గొప్ప మేధావిగా తీర్చిదిద్దింది. అలా తల్లి ప్రోత్సాహం, మార్గదర్శకత్వంలో స్వయం కృషితో థామస్ ఎడిసన్ ప్రపంచంలోనే గొప్ప ఆవిష్కర్తగా రూపు దిద్దు కున్నాడు. మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప శాస్త్రవేత్తగా చరిత్రలో మిగిలాడు. థామస్ ఎడిసన్ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక రైళ్ళలో న్యూస్ పేపర్లు, స్వీట్లు అమ్మేవాడు. అతి చిన్న వయస్సు లోనే టెలిగ్రాఫ్ నమూనా యంత్రాన్ని తయారు చేశాడు. 1861లో ఎడిసన్ "గ్రాంట్ ట్రంక్ హెరాల్డ్" అనే సాధారణ న్యూస్ పేపర్ నడిపాడు. 1862 లో ఎడిసన్ ఒక స్టేషను మాష్టర్ బిడ్డను ప్రమాదం నుంచి రక్షించి ప్రతిఫలంగా ఆయన వద్ద నుంచి టెలీగ్రఫీని నేర్చు కున్నాడు...తన టెలిగ్రాఫ్ పరికరాన్ని పరిస్థితుల కారణంగా విధిలేక అమ్ముకున్నాడు. 1878 లో ఎలక్ట్రిక్ బల్బ్ ను 1877 లో ఫోనోగ్రాఫ్ ను, 1887-1889 మధ్య లో టైప్ రైటర్, ఎలక్ట్రిక్ పెన్, గ్రామ ఫోన్, మోషన్ పిక్చర్ కెమేరా, తదితర ఎన్నింటినో ఆయన ఆవిష్కరించాడు. అక్టోబరు 18 1931న మరణించాడు. థామస్ పేరు ప్రతిష్టలు గడుస్తున్న సమయంలోనే ఆయన తల్లి మరణించింది. ఒకరోజు థామస్ తన ఇంట్లోని పాత వస్తువులు తొలగించే పనిలో.. బీరువాలో ఒక లెటర్ కనిపించింది. అది తాను పాఠశాలలో చదువుకుంటున్న రోజుల్లో ఉపాధ్యాయులు తనకు ఇచ్చిన లెటర్ గా

గుర్తించాడు.ఆ లెటర్ చదివిన థామస్ ఒక్కసారిగా షాక్‌కు గురైనాడు. ఇంతకీ ఆ లెటర్‌లో ఏముం దంటే 'మీ కుమారుడు థామస్ మానసికంగా చాలా బలహీనుడు. ఇలాంటి కుర్రాడికి మా స్కూలులో చదువు చెప్పలేం. దయచేసి మీ అబ్బాయికి మీ ఇంట్లోనే చదువు నేర్పండి' అని వుంది. ఈ లెటర్ చదవగానే థామస్ కన్నీళ్లు ఆపుకోలేక పోయాడు. అప్పుడు థామస్‌కు.. తన తల్లి పడిన ఆవేదన, తనను మేధావి గా తీర్చి దిద్దడానికి ఆమె చేసిన కృషి, పడిన కష్టం గురించి స్పష్టమైంది. తన తల్లి గనుక ఆ లెటర్‌లో ఉన్నది ఉన్నట్లు చదివి ఉంటే... తన బలహీనత తెలిసిపోయి, తాను ఇన్ని ఆవిష్కర ణలు చేసే అవకాశమే ఉండేది కాదని అనుకుంటూ ఉద్వేగ భరితంగా, ఎడిసన్ తన డైరీలో వెంటనే... 'థామస్ ఎడిసన్ ఒక మానసిక వికలాంగుడైన అబ్బాయి. అతడిని మాతృమూర్తి ఈ శతాబ్దానికే మేధావిగా మార్చింది" అని రాసుకున్నాడు.

# 21నియోజకవర్గాల్లో అభివృద్ధి సూపర్ గ్రేడింగ్ లు ఇచ్చిన ప్రభుత్వం

**విజయవాడ, ఫిబ్రవరి 10, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పనితీరు సూచీలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. వివిధ అభివృద్ధి ,సంక్షేమ సూచికల ఆధారంగా 175 నియోజకవర్గాల ర్యాంకింగ్స్ ఇచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ అభివృద్ధి సూచికలు , సంక్షేమ పథకాల అమలు, ప్రజల సంతృప్తిని ప్రాతిపదికగా తీసుకుని ప్రకటించిన ఈ ర్యాంకుల్లో మెజారిటీ నియోజకవర్గాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. మొత్తం 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలు ఏ ప్లస్ (ఛా+) గ్రేడ్ సాధించగా, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడ్ దక్కించుకున్నాయి. కేవలం ఒకే ఒక నియోజకవర్గం బి గ్రేడ్‌కు పరిమితం కావడం గమనార్హం. వీటిలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 13 నియోజకవర్గాలు రాష్ట్రానికి రోల్ మోడల్స్‌గా నిలిచాయి. రాష్ట్రంలోనే 93 శాతం మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. ఎమ్మెల్యే సుజనా చౌదరి మార్క్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, పారిశుధ్య నిర్వహణలో సాధించిన పురోగతి ఈ ర్యాంకు సాధనలో కీలక పాత్ర పోషించాయి. క్షేత్రస్థాయిలో ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం , విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో సుజనా చౌదరి చూపిన చొరవ ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది.రెండవ స్థానంలో నిలిచిన గాజువాకకు 92 మార్కులు వచ్చాయి. నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి , స్థానిక మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. అలాగే, మూడవ స్థానాన్ని దక్కించుకున్న కాకినాడ నగర నియోజకవర్గం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలులోనూ, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ మేటిగా నిలిచింది. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రజలకు చేరువ చేయడంలో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కృషి స్పష్టంగా కనిపిస్తోంది.అలాగే నాలుగవ స్థానంలో నిలిచిన విజయవాడ తూర్పు నియోజకవర్గం కూడా పారిశుద్ధ్యం, పౌర సేవలలో అద్భుతమైన స్కోరును సాధించింది.

ఈ ర్యాంకింగ్స్ కేవలం అంకెలకు పరిమితం కాకుండా, ఎమ్మెల్యేల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచడానికి దోహదపడుతున్నాయి. ప్రతి రూపాయి ప్రజల కోసమే ఖర్చు కావాలన్న ప్రభుత్వ సంకల్పం, ఈ ఫలితాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తోంది. ఏ ప్లస్ నియోజకవర్గాల స్ఫూర్తితో మిగిలిన ప్రాంతాల్లో కూడా పాలనను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# రాజ్యసభ రేసు... మా కో సీటు కావాలంటూ వినతులు



**విజయవాడ, ఫిబ్రవరి 10, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు 'రాజ్యసభ సీట్ల' చుట్టూ తిరుగుతున్నాయి. వచ్చే జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల కోసం అధికార కూటమిలో ఇప్పటి నుంచే సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయమని తేలిపోవడంతో, ఆ సీట్లను దక్కించుకునేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది.ప్రస్తుత అంచనాల ప్రకారం, మొత్తం 4 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ రెండు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం కనిపిస్తోంది. తమకు ఖచ్చితంగా ఒక స్థానం కేటాయించాలని పవన్ కల్యాణ్ పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఆయన ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించినందున, తమ పార్టీకి పెద్దల సభలో ప్రాతినిధ్యం ఉండాలని జనసేన గట్టిగా కోరుతోంది.జనసేన కోటాలో సీటు దక్కితే, ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీకి ఆయన అందిస్తున్న సహకారం, పవన్ కల్యాణ్‌తో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు ప్లస్ కానున్నాయి. టీడీపీతో సత్సంబంధాలు రమేశ్ కు కలిసొచ్చే అంశంఇక టీడీపీకి దక్కే రెండు స్థానాల కోసం పార్టీ సీనియర్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమా మహేశ్వర రావు, పార్టీ విధేయుడు కంభంపాటి రామ్మోహన్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత సభ్యుడు సానా సతీశ్ తన పదవిని రెన్యూవల్ చేసుకోవాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీ అవసరాల దృష్ట్యా చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.బీజేపీకి దక్కే ఒక స్థానం విషయంలో అత్యంత ఆశ్చర్యకరమైన చర్చ జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండి ఆ పార్టీ నుంచి బయటికొచ్చిన విజయసాయి రెడ్డి, అనూహ్యంగా బీజేపీ తరపున రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే వార్తలు రాజకీయ వర్గాలను షేక్ చేస్తున్నాయి. ఆయన ఇప్పటికే ఎంపీ పదవికి రాజీనామా చేయడం, బీజేపీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ఇటీవలే తాను జూన్ నుంచి రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించడంతో రాజ్యసభ సీటు ఊహాగానాలు నిజమేనేమో అనిపిస్తోంది. అయితే, బీజేపీ అధిష్టానం స్థానిక నేతలకు ఇస్తుందా లేక బయటి వ్యక్తులను ప్రోత్సహిస్తుందా అనేది సస్పెన్స్‌గా మారింది.కూటమిలోని మూడు పార్టీల మధ్య ఎక్కడా అసంతృప్తి రాకుండా, సమన్యాయం ప్రాతిపదికన సీట్ల పంపకం ఉండాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. జూన్ నాటికి ఈ సమీకరణాలు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా, ఈసారి ఏపీ రాజ్యసభ ఎన్నికలు కేవలం అభ్యర్థుల ఎంపిక మాత్రమే కాదు.. కూటమి పార్టీల మధ్య సమన్వయానికి, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలకు ఒక పరీక్షగా నిలవనున్నాయి.

# ఆల్ ఇన్ వన్ స్మార్ట్ కార్డులు



**ఏలూరు, ఫిబ్రవరి 10, పెన్ పవర్:**
పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్న ఏపీ ప్రభుత్వం మరో సరికొత్త ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందించనున్నారు. సోమవారం రోజున జరిగిన సమీక్షా సమావేశంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులపై అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. జూన్ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందిస్తారు. ప్రతీ కుటుంబాన్ని ఓ యూనిట్ కింద పరిగణిస్తారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల మీద ప్రత్యేకంగా ఓ క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కుటుంబం మొత్తం సమాచారం ఉండటంతో పత్రాలను మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

# మొదట మున్సిపాలిటీ, తరువాత పంచాయతీ ఎన్నికలు..

**విజయవాడ, ఫిబ్రవరి 10, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. మార్చి 9వ తేదీన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం ముగియ వస్తుండటంతో, సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతోంది. కొత్త ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ నోటిఫికేషన్లు జారీ చేశారు.ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం వచ్చే నెల 17తో ముగియనుంది. మరోవైపు గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుంది. మున్సిపల్ పోరుకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే జిల్లాల వారీగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 జనవరి 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది. మార్చి 9న ఫోటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఏపీలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) ఉన్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. 13,351 పంచాయతీలలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు మొదలు కానున్నాయి. ఇప్పటికే వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల ఓటర్ జాబితాకు నోటిఫికేషన్ రావడమంటే ఎన్నికల నగరాలో తొలి ఘట్టం అని తెలిసిందే. స్థానిక సంస్థల నోటిఫికేషన్ తేదీపై స్పష్టత రావడంతో ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ రాజకీయ సమీకరణాలు మొదలుపెడతాయి.

# నైరాశ్యంలో వైసీపీ నేతలు



**నెల్లూరు ఫిబ్రవరి 10, పెన్ పవర్:** 2024 ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు వైసీపీ లో స్పష్టమైన ఉత్సాహం కనిపించలేదు. నెక్స్ట్ ఎన్నికలకు ఇంకా సమయం ఉందని భావించిన చాలా మంది నేతలు, ఇప్పుడే ఎందుకు బహిరంగంగా కదలాలన్న ఆలోచనలోనే ఉండిపోయారు. మరికొందరు మాత్రం పార్టీ కార్యక్రమాలకంటే తమ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడమే సరిపోతుందన్న భావనతో ముందుకు సాగారు. అందుకే గత 19 నెలలుగా పార్టీ పిలుపునిచ్చిన ఉద్యమాలు, నిరసనలకు పెద్దగా స్పందన కనిపించలేదు. పూర్తిగా దూరంగా కూడా ఉండకుండా, ప్రజల్లోకి వెళ్లినట్టు వెళ్లి, కార్యక్రమాలు జరిగాయన్న ముద్ర వేసినట్టే వ్యవహారం సాగింది.ఈ పరిస్థితిపై పార్టీ అధినేత జగన్ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. నేతల్లో చురుకుదనం రావాలని, ప్రజల మధ్య కలివిడిగా ఉండాలని సూచనలు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే ఇటీవల జరిగిన రెండు పరిణామాలు మాత్రం పార్టీ వాతావరణాన్ని పూర్తిగా మార్చేశాయి. ఒక్కసారిగా నేతలంతా ఏకం కావడం మొదలైంది. ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు వైసీపీ శ్రేణుల్లో కదలిక పెరిగింది.అంబటి రాంబాబు (, జోగి రమేష్ ఇళ్లపై దాడులు జరగడం ఈ మార్పుకు ప్రధాన కారణంగా మారింది. ఈ ఘటనలను పార్టీ నేతలు తేలిగ్గా తీసుకోలేదు. ఇది కేవలం వ్యక్తిగత అంశం కాదని, తమ రాజకీయ స్వరాన్ని అణిచివేసే ప్రయత్నంగా భావించారు. ముఖ్యంగా కాపు, బీసీ వర్గాలను ఏకం చేయడం, పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించడం అవసరమని నాయకత్వం భావించింది. అందుకే ఈ అంశాలను భుజాన వేసుకుని, ప్రజల్లోకి వెళ్లేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.గతాన్ని పరిశీలిస్తే, ఇలాంటి పరిస్థితి ఒకప్పుడు టీడీపీలో కూడా కనిపించింది. 2019 నుంచి 2021 మధ్య ఆ పార్టీలోనూ నైరాశ్య వాతావరణం నెలకొంది. సమావేశాలు పెట్టినా పెద్దగా స్పందన రాలేదు. అయితే నందిగామ )లో చంద్రబాబు నాయుడు పై రాళ్ల దాడి, పార్టీ కార్యాలయంపై దాడులు జరిగిన తర్వాత పరిస్థితి మారింది. అప్పటివరకు వెనుకంజలో ఉన్న నేతలు ఒక్కసారిగా ముందుకు వచ్చారు. పార్టీని, నాయకుడిని కాపాడుకోవాలన్న భావన వారిని ఏకం చేసింది.ఇప్పుడు అదే తరహా సమీకరణ వైసీపీలో జరుగుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. నేతలు వ్యక్తిగతంగా కాకుండా, సమష్టిగా పార్టీ కోసం నిలబడాలన్న భావన బలపడుతోంది. ఈ కదలిక ఎన్నికల వరకు ఎంతవరకు కొనసాగుతుంది, పార్టీకి ఎంత మేలు చేస్తుందన్నది కాలమే నిర్ణయించాలి. అయితే ప్రస్తుతం మాత్రం వైసీపీలో కనిపిస్తున్న ఐక్యత రాజకీయంగా కీలక సంకేతంగా మారిందని చెప్పాలి.

# ఏపీలో మరో అండర్‌పాస్

**నెల్లూరు, ఫిబ్రవరి 10, పెన్ పవర్:** ఏపీలో మరో అండర్‌పాస్ నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. నెల్లూరులో కీలకమైన అండర్‌పాస్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే ఈ అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ.115 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని కుదిరితే ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నెల్లూరుకు ఈ అండర్‌పాస్ కీలకంగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల్ని వేగవంతం చేసింది. రోడ్లు, రైల్వే లైన్లు, ఫ్లై ఓవర్లు, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు.. ఇలా ఎన్నో పనులు చేపడుతోంది. తాజాగా నెల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతూ అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధమైంది. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెం వెళ్లే జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం చేయనున్నారు. ఈ అండర్ పాస్‌ను ఏకంగా ఆరు వరుసలుగా నిర్మించనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గతేడాది నవంబరులో మంజూరు చేసింది. అంతేకాదు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. ప్రస్తుతం భూసేకరణ చేపట్టారు. ఈ పనులు శరవేగంగా పూర్తిచేసి.. ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఈ అండర్‌పాస్ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు.ఈ అండర్‌పాస్ కోసం మొత్తం రూ.115.27 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అండర్‌పాస్ నిర్మాణానికి 3.57 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఈ నిధుల్లో రూ.22 కోట్లు భూసేకరణ కోసం కేటాయించారు. ఈ అండర్‌పాస్ కోసం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి.. వెంటనే అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నీ కుదిరితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అండర్‌సాస్ పనులు ప్రారంభించి.. దాదాపు 15 నెలల్లో పూర్తి చేయిస్తామని చెబుతున్నారు అధికారులు. అందుకే భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు అధికారులు.ఈ అండర్‌పాస్‌ను చింతారెడ్డిపాళేనికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీ జంక్షన్ నుంచి హరనాథపురం చివర కలిసే కృష్ణపట్నం రోడ్డు దగ్గర దాబా వరకు పనులు చేపట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అండర్‌పాస్ ప్రస్తుతం సుమారు 2.12 కి.మీ. పొడవుతో ఉంది. ఇప్పుడు ఉన్న నాలుగు లైన్ల రోడ్డు స్థానంలో ఆరు వరుసల అండర్ పాస్ వచ్చేలా ప్లాన్ చేశారు. ఈ అండర్‌పాస్ అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాదాలు నియంత్రించొచ్చని.. ట్రాఫిక్ ఫ్రీ జర్నీ చేయొచ్చు అంటున్నారు. మొత్తం మీద నెల్లూరు నగరానికి మరో అండర్‌పాస్ రాబోతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ప్రచురించబడని పుస్తకం ప్రతులు పార్లమెంటులోకి ఎలా వచ్చాయి?




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే రాసిన పుస్తకం ఇప్పుడు దేశంలో పెద్ద వివాదానికి కారణం అయింది. ఈ పుస్తకం పేరు “ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ”. ఇది నరవణే తన జీవిత అనుభవాలు, ఆర్మీ చీఫ్‌గా పనిచేసిన సమయంలో జరిగిన విషయాల గురించి రాసిన ఆత్మకథ. ఈ పుస్తకం 2024లోనే విడుదల కావాల్సి ఉంది. పబ్లిషర్ ప్రచురణకు సిద్ధం కాగా ప్రీ-ఆర్డర్లు కూడా మొదలయ్యాయి. కానీ కేంద్ర రక్షణ శాఖ నుంచి అనుమతి రాకపోవడంతో పుస్తకం విడుదల ఆగిపోయింది. ఇప్పటికీ (2026లో కూడా) ఈ పుస్తకం అధికారికంగా బయటకు రాలేదు. కారణం ఏమిటంటే.. ఇందులో గల్వాన్ ఘర్షణ, పుల్వామా ఘటన లాంటి సున్నితమైన విషయాలు ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇవి జాతీయ భద్రతకు సంబంధించినవి కావడంతో అనుమతి ఇవ్వలేదు. ఇలాంటి పరిస్థితిలో ఈ పుస్తకం ప్రతులు పార్లమెంట్‌లో కనిపించడం బిగ్ షాకింగ్ గా మారింది. ఫిబ్రవరి 2026లో లోక్‌సభ బడ్జెట్ సమావేశాల సమయంలో పార్లమెంటులో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఈ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని చూపిస్తూ.. పుస్తకంలోని కొన్ని భాగాలను చదవాలని ప్రయత్నించారు. అందులో గల్వాన్ ఘర్షణ సమయంలో కేంద్ర నాయకత్వం సరైన నిర్ణయాలు తీసుకోలేదని, స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదని ఉన్నట్లు రాహుల్ చెప్పారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. స్పీకర్ వెంటనే కలుగజేసుకొని.. “విడుదల కాని పుస్తకంలోని వ్యాఖ్యాలను చదవకూడదు” అని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా స్పందిస్తూ.. “ఈ పుస్తకం ఇంకా అధికారికంగా ఉనికిలోనే లేదు” అన్నారు. అనంతరం పుస్తకంలోని అంశాలపై పార్లమెంటులో చర్చకు ప్రతిపక్ష నేతలు పట్టుబట్టడంతో, సభలో గందరగోళం నెలకొని 8 మంది ఎంపీలను స్పీకర్ సస్పెండ్ చేశారు. ఈ వివాదం రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపింది. బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఆయన సైన్యం గౌరవాన్ని దెబ్బతీశారని, పార్లమెంట్ నిబంధనలు ఉల్లంఘించారని అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మాత్రం కేంద్ర ప్రభుత్వం చర్చకు భయపడుతోందని, నిజాలు బయటకు రాకుండా అడ్డుకుంటోందని విమర్శిస్తోంది. ఈ మొత్తం వ్యవహారం గల్వాన్ ఘర్షణపై మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ మొదలయ్యేలా చేసింది. ఒక విడుదల కాని ఆర్మీ చీఫ్ పుస్తకం ఇప్పుడు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.

# రబ్రీదేవిపై నోరు జారిన బిహార్ సీఎం నితీష్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్ సీఎం నితీష్ కుమార్ మరో వివాదంలో ఇరుక్కున్నారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ భార్య, మాజీ సీఎం రబ్రీదేవిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు.సోమవారం లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మహిళల భద్రత, మహిళలపై నేరాలు, గతంలో ఆర్జేడీ ప్రభుత్వం ఉన్నప్పుడు మహిళల అభివృద్ధి ఎలా ఉందన్న అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా నితీష్ కుమార్ ఆగ్రహంతో మాట్లాడుతూ.. ఆర్జేడీ నేత రబ్రీ దేవిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడారు. ”ఈ అమ్మాయి ఏమైనా పని చేసిందా? భర్తను పదవి నుంచి తొలగించాక, ఆ అమ్మాయిని అనవసరంగా ముఖ్యమంత్రిని చేశారు” అన్న భావంలో మాట్లాడారు. రబ్రీ దేవిని “అమ్మాయి” అని పిలవడం, ఆమెను అవమానించడమే అని విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఒక మాజీ ముఖ్యమంత్రి గురించి ఇలా మాట్లాడటం తగదని రాజకీయ, సామాజిక వర్గాలు అంటున్నాయి. మరోవైపు నితీష్ వ్యాఖ్యలపై ఆర్జేడీ పార్టీ తీవ్రంగా స్పందించింది. రబ్రీ దేవి కుమారుడు, ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఇది కేవలం తన తల్లిపై మాత్రమే కాదు, మహిళలందరిపై అవమానమని అన్నారు.

నితీష్ కుమార్ ఆలోచన విధానం వెనుకబాటుతనంగా ఉందని, ఆయనను మహిళలకు ఎలా గౌరవం ఇవ్వాలో తెలియని వ్యక్తిగా విమర్శించారు. ఈ వ్యవహారంలో ఆర్జేడీ సభ్యులు సభలో నిరసనకు దిగగా.. సభలో గందరగోళం నెలకొంది. నితీష్ కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాగా లాలూ అరెస్టు అయిన తర్వాత 1997 నుంచి 2005 వరకు ఆయన భార్య రబ్రీదేవి బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. నితీష్ కుమార్ గతంలో ఆర్జేడీతో కలిసి పనిచేసి, తర్వాత విడిపోయి బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య రాజకీయ వైరం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నితీష్ కుమార్ వ్యాఖ్యలు బీహార్ రాజకీయాల్లో పెద్ద దుమారం రేపాయి.

## స్పీకర్‌పై అభిశంసన? ఖర్గే చాంబర్‌లో విపక్ష నేతల నిర్ణయం!

**హైదరాబాద్ పెన్ పవర్:** బడ్జెట్ సమావేశాల 9వ రోజు కూడా పార్లమెంటులో రగడ కొనసాగింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడకుండా అడ్డుకున్నందుకు స్పీకర్ ఓంబిర్లాపై అభిశంసన పెట్టే అంశాన్ని విపక్షాలు పరిశీలిస్తున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94-సీ ప్రకారం ఈ తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాహుల్‌ను మాట్లాడకుండా అడ్డుకున్నందుకు, బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోనందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపీలు ప్రధానిపై దాడి చేసేందుకు ప్లాన్ వేశారని అబద్ధపు ఆరోపణలు చేసినందుకు, 8 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసినందుకు స్పీకర్‌పై అభిశంసన తీర్మానం పెట్టాలని విపక్షాలు అనుకుంటున్నాయట. సుమారు 100 మంది ఎంపీలు ఈ తీర్మానంపై సంతకాలు పెడతారని, ఈ తీర్మానాన్ని మంగళవారం నాడు పార్లమెంటులో ప్రవేశపెడతారని తెలుస్తోంది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జు?న్ ఖర్గే చాంబర్‌లో జరిగిన మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కమ్యూనిటీస్టు పార్టీలు. టీఎంసీ, డీఎంకే, ఎస్పీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ), ఆర్‌ఎస్పీ తదితర పార్టీల నేతలు ఈ భేటీలో పాల్గొనట్లు సమాచారం. పార్లమెంటుకు ప్రధాని మోడీ గైర్హాజరవడంపై స్పీకర్ ఓంబిర్లా చేసిన వ్యాఖ్యలను రాహుల్ గాంధీ ఖండించారు. ప్రధానిపై కాంగ్రెస్ నేతలు దాడి చేసేందుకు ప్లాన్ వేశారని, అందుకే ఆయన్ను సభకు రావొద్దని తాను కోరినట్లు ఓంబిర్లా చెప్పిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలను కొట్టిపారేసిన రాహుల్.. నరవణే పుస్తకంపై చర్చకు, తనకు ఎదురయ్యే ప్రశ్నలకు భయపడే సభకు మోడీ రావడం లేదని విమర్శించారు.

## గెలవకపోతే ఆ రాష్ట్రానికి కేంద్రం నిధులు ఇవ్వదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏదైనా రాష్ట్రంలో బీజేపీ గెలవకపోతే, ఆ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదా? ఇదేనా సమాఖ్య వాదమంటే..” అంటూ సీపీఐ(ఎం) ఎంపీ ఏఏ రహీమ్ ప్రశ్నించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా అప్రకటిత ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ కేరళ అభివృద్ధి చెందిందని తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సహాయం లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందుతూనే ఉంటుందని అన్నారు. సోమవారం రాజ్యసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. “కేరళ అప్పుల ఊబిలో ఉందని బీజేపీ, కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కేంద్రం అప్పు రూ.1.97 కోట్ల నుంచి రూ.2.14 కోట్లకు పెరుగుతుందని బడ్జెట్ పత్రాలు చూపిస్తున్నాయి. ఇది జీడీపీలో 56 శాతం, కానీ కేరళది కేవలం 38.47 శాతం. కేంద్రమంత్రి సురేశ్ గోపి కేరళకు ఎయిమ్స్ కేటాయిస్తామని మాట్లాడారు. ఇది కేవలం ఖాళీ వాగ్దానం. మాజీ మంత్రి కూడా అయిన కేరళ బీజేపీ అధ్యక్షుడు, రాష్ట్రంలో ఆ పార్టీ ఎన్నికయ్యే వరకు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వదని అన్నారు. దేశ యువతను నిరుద్యోగం వెంటాడుతోందనీ, జీవన వ్యయం పెరుగుతోందని తెలిపారు. దీనికి మూల కారణం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించి, బీజేపీ ప్రభుత్వం కొనసాగిస్తున్న నయా ఉదారవాద విధానాలేనని స్పష్టం చేశారు. “దేశంలో కాంట్రాక్టీకరణ, ప్రయివేటీకరణ పెరుగుతోంది. అగ్నివీర్‌తో సైన్యాన్ని కూడా కాంట్రాక్టుగా మార్చారు. శాశ్వత ఉద్యోగాలను తగ్గించడంతో ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సహా ప్రయివేట్ రంగంలో అధిక పనిభారం, లక్ష్యాల కారణంగా యువత ఇబ్బందులు పడుతున్నారు. అధిక పనిభారం కారణంగా ఆత్మహత్య చేసుకున్న అన్నా సెబాస్టియన్‌ను మనలో ఎవరూ మర్చిపోలేరు. గిగ్ ఎకానమీ పెరుగుతోంది. ఇది వ్యవస్థీకృత రంగం పతనం ఫలితంగానే జరిగింది” అని ఆయన తెలిపారు. దేశంలో కాంట్రాక్టీకరణను నిలిపివేయాలని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేయాలని రహీమ్ డిమాండ్ చేశారు.

రోడ్డుపై విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్..

## మూడు కార్లు ధ్వంసం, ఇద్దరికి గాయాలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఓ విమానం అత్యవసరంగా రోడ్డుపై ల్యాండ్ బీభత్సం సృష్టించిన ఘటన అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అట్లాంటా నగరానికి ఉత్తరాన ఉన్న గైనెస్‌విల్లేలో ‘హాకర్ బీచ్‌క్రాఫ్ట్ ఃఇ-36’ అనే సింగిల్ ఇంజిన్ విమానం గాల్లో ఉండగానే ఒక్కసారిగా ఇంజిన్‌లో టెక్నికల్ సమస్య తలెత్తింది. విమానం అదుపు తప్పుతుండటంతో పైలట్ అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. సమీపంలోని రద్దీగా ఉండే రహదారిని రన్‌వేగా భావించి విమానాన్ని దించేందుకు ప్రయత్నించారు. విమానం రోడ్డుపైకి దూసుకొస్తున్న క్రమంలో అక్కడ ప్రయాణిస్తున్న మూడు కార్లను బలంగా ఢీకొట్టింది. ఈ అనూహ్య ఘటనతో ఒక్కసారిగా స్థానికులు షాక్‌కు గురయ్యారు. విమానం రెక్కలు, ముందు భాగం కార్లను తాకడంతో వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ దుర్ఘటనలో ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక, అత్యవసర సేవల సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో గోల్డెన్ కోరల్ ప్రాంతంలోని రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు రంగంలోకి దిగి విమానాన్ని రోడ్డుపై నుంచి తొలగించే చర్యలు చేపట్టారు. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. ఇంజిన్ వైఫల్యానికి గల ఖచ్చితమైన కారణాలను విశ్లేషిస్తున్నారు.

## వెస్ట్‌బ్యాంక్ విలీనం కోసమే ఇజ్రాయిల్ కొత్త చట్టాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్ట్‌బ్యాంక్ విలీనం కోసమే ఇజ్రాయిల్ కొత్త చట్టాలను ఆమోదించిందని ఎన్‌జిఒ ఆందోళన వ్యక్తంచేసింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ భద్రతా మండలి ఆమోదించిన ఇటీవలి నూతన చట్టాలు ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ విలీనానికి మార్గం సుగమం చేస్తాయని స్వచ్ఛంద సంస్థ పీస్ నౌ(పిఎన్) హెచ్చరించింది. ఈ చర్యలు పాలస్తీనియన్ అథారిటీ పరిపాలనలో ఉన్న ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని 40శాతం ప్రాంతాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయని పిఎన్ పేర్కొంది. చట్టంలోని అత్యంత వివాస్పద నిర్ణయాల్లో అరబ్ పౌరులకు భూమి కొనుగోళ్లను పరిమితం చేసిన 1953 జోర్డాన్ చట్టాన్ని రద్దు చేయడం ఒకటని హెచ్చరించింది. ఈ సవరణ ఇజ్రాయిల్ స్థిరనివాసులు కంపెనీలను స్థాపించాల్సిన అవసరం లేకుండా పాలస్తీనియన్ల నుండి నేరుగా భూమిని పొందేందుకు వీలు కల్పిస్తుందని, ఇది మోసపూరిత రియల్‌ఎస్టేట్ కార్యకలాపాలకు ద్వారాలు తెరుస్తుందని పిఎన్ వాదించింది. వెస్ట్‌బ్యాంక్‌లోని భూమి రిజిస్ట్రీని వర్గీకరించడం మరో వివాదాస్పద అంశంగా పేర్కొంది. ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టిన పాలస్తీనియన్లను రక్షించడం, మోసాన్ని నిరోధించం మరియు ఇజ్రాయిలీయులకు భూమిని విక్రయించిన వారి భద్రతకు హామీ ఇవ్వడం లక్ష్యంగా ఈ డేటాను గోప్యంగా ఉంచినట్లు పీస్‌నౌగుర్తు చేసింది. ఈ చట్ట సవరణ ఇజ్రాయిల్ స్థిరనివాసులు ఆస్తులను గుర్తించడం మరియు ఒత్తిడి లేదా ఫోర్జరీ ద్వారా వాటిని స్వాధీనం చేసుకోవడం సులభతరం చేస్తుందని వాదించింది. కొత్త చట్టంతో నీరు, పర్యావరణం మరియు పురావస్తు ప్రదేశాలకు సంబంధించిన విషయాల్లో ఇజ్రాయిల్ జోక్యం చేసుకోగలదని సంస్థ హైలెట్ చేసింది. ఇది పాలస్తీనా ప్రజలను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందని, 1990లో సంతకం చేసిన ఓస్లో ఒప్పందాలను ఉల్లంఘిస్తుందని పునరుద్ఘాటించింది.

## జపాన్‌లో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం పునఃప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను జపాన్ సోమవారం పునఃప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ఈ కర్మాగారం తిరిగి విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. 2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను జపాన్ ప్రభుత్వం మూసివేసింది. ఆ తర్వాతి పరిస్థితుల్లో.. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావించింది. 2050 నాటికి ‘కార్బన్ న్యూట్రాలిటీ’ సాధించడానికి, కృత్రిమ మేధ (ఏఐ) అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి మళ్లీ అణుశక్తి వైపు మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను పునఃప్రారంభించడానికి జనవరిలో మొదటిసారి ప్రయత్నించారు. అయితే, మానిటరింగ్ అలారం మోగడంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కర్మాగారంలోని ఒక రియాక్టర్ సోమవారం మధ్యాహ్నం 2:00 గంటలకు తిరిగి ప్రారంభమైనట్లు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టీఈపీసీఓ) ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చేనెలలో సమగ్ర తనిఖీ ముగిశాక ఈ ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ కర్మాగారంలో మొత్తం ఏడు రియాక్టర్లు ఉన్నాయి.

## కెనడా-అమెరికా మధ్య వంతెనను బ్లాక్ చేస్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:** కనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ దేశాన్ని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రంప్ కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవన్నారు. అగ్రదేశాన్ని కాదని.. చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారన్నారు.

## భారత్- అమెరికా ట్రేడ్ డీల్.. హడావుడిగా అమెరికాతో బంగ్లా ఒప్పందం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ - అమెరికా మధ్య ట్రేడ్ డీల్ జరగడంతో ఆందోళన చెందిన బంగ్లాదేశ్.. ఆగమేఘాల మీద అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకుంది. అమెరికా - బంగ్లాదేశ్ మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇరు దేశాలు సోమవారం ఒక కీలకమైన ‘పరస్పర వాణిజ్య ఒప్పందం’ కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికా మార్కెట్‌కు బంగ్లాదేశ్ చేసే ఎగుమతులపై సుంకం గతంలో ఉన్న 20 శాతం నుండి 19 శాతానికి తగ్గనుంది. గత ఏడాది ఆగస్టులో 20 శాతంగా ఉన్న పరస్పర టారిఫ్‌ను తాజా ఒప్పందంతో 19 శాతానికి తగ్గించారు. ఒకప్పుడు ఇది 37శాతంగా ఉండేది. అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న పత్తి, కృత్రిమ నూలు ఉపయోగించి బంగ్లాదేశ్ తయారు చేసే దుస్తుల ఎగుమతులపై సున్నా శాతం (0%) టారిఫ్ విధించేలా వాషింగ్టన్ అంగీకరించింది. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య సంబంధాలను ఒక చారిత్రాత్మక స్థాయికి తీసుకెళ్తుందని బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్, బంగ్లాదేశ్ వాణిజ్య సలహాదారు షేక్ బషీర్ ఉద్దీన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్ వాణిజ్య కార్యదర్శి మహబుబూర్ రెహమాన్, అమెరికా అసిస్టెంట్ వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేమీసన్ గ్రీర్ మాట్లాడుతూ.. ట్రంప్ నాయకత్వంలో అమెరికా కార్మికులు వ్యాపారాలకు ప్రయోజనం చేకూర్చేలా వాణిజ్య విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. దక్షిణాసియాలో ఈ తరహా ఒప్పందం జరగడం ఇదే మొదటిసారి అని పేర్కొన్నారు. టారిఫ్ తగ్గింపు తమ ఎగుమతిదారులకు అదనపు ప్రయోజనాన్ని చేకూరుస్తుందని బంగ్లాదేశ్ ముఖ్య సంప్రదింపుల అధికారి రెహమాన్ తెలిపారు. ముఖ్యంగా అమెరికా ముడిసరుకుతో తయారయ్యే వస్త్రాలపై సున్నా సుంకం ఉండటం తమ గార్మెంట్ రంగానికి పెద్ద ఊతం ఇస్తుందన్నారు. ఈ ఒప్పందానికి బంగ్లాదేశ్ సలహాదారుల మండలి ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఇరు ప్రభుత్వాలు అధికారిక నోటిఫికేషన్లు జారీ చేసిన వెంటనే ఈ ఒప్పందం అమలులోకి రానుంది.

# చపాతీలను నేరుగా మంటపై కాల్చి తింటే క్యాన్సర్ వస్తుందా?



భారతీయ ఆహారంలో చపాతీ ముఖ్యమైనది. ఎక్కువ మంది ఉత్తర భారతదేశంలో, కొంతమంది దక్షిణ భారతదేశంలో కూడా చపాతీ తింటారు. చాలామంది చపాతీలను డైరెక్ట్ మంటపై కాల్చి తింటారు, ఇది ప్రత్యేక రుచి ఇస్తుంది. కానీ నల్లటి మచ్చలు ఏర్పడితే, క్యాన్సర్ వచ్చే అనుమానం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భారతీయ ఆహార పదార్థాలలో చపాతీ కూడా ముఖ్యమైనది. ఉత్తర భారతదేశంలోనే ఎక్కువగా చపాతీ తింటారు. కానీ, దక్షిణ భారతదేశంలోనూ ఇది ప్రధాన ఆహార పదార్థాలలో ఒకటిగా ఉంది. ఎక్కువగా రాత్రి సమయంలో చపాతీని ఇక్కడ తీసుకుంటారు. అయితే, చపాతీ చేసే విధానాలు కొన్ని భిన్నంగా ఉంటాయి. చపాతీలు/రోటీలను చేసేందుకు ఎక్కువగా పెనం వాడతారు. కానీ, కొందరు మాత్రం డైరెక్టుగా పొయ్యి లేదా గ్యాస్ స్టవ్‌పైనే కాలుస్తూ ఉంటారు. నేరుగా మంటపైనే రోటీని కాల్చితే అదో రకమైన రుచి ఉంటుంది. ఈ టేస్ట్‌ను చాలా మంది ఇష్టపడి తింటూంటారు. అయితే, ఇలా చపాతీలను లేదా రోటీలను కాల్చినప్పుడు వాటిపై బాగా కాలడంతో నల్లటి మచ్చలుగా ఏర్పడతాయి. కొంచెం బొగ్గులా ఉండే వీటిని తీసుకుంటే క్యాన్సర్ వస్తుందనే ప్రచారం కూడా ఉంది. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ విషయం గురించిన వాస్తవాలను ఇప్పుడు తెలుసుకుందాం. గురుగ్రామ్‌లోని నారాయణ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ దేబాషిష్ చౌదరి ఈ ఆందోళనను శాస్త్రీయ పరంగా వివరించారు. మంటలో కాలిన చపాతీ/రోటీ.. ఎందుకు అనారోగ్యం కలిగిస్తుంది?.. చపాతీ నేరుగా మంటలో ఉడికినప్పుడు నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు రుచి కోసం కొంత మంది ఆస్వాదిస్తారు, కానీ ఎక్కువ వేడిలో వండినప్పుడు కొంత రసాయనాలు, పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు, అక్రిలామైడ్ వంటి పదార్థాలు ఉత్పన్నమవుతాయి. ఇవి అధిక పరిమాణంలో, తరచుగా తినడం వల్ల క్యాన్సర్ ప్రమాదంతో సంబంధం కలిగే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. క్యాన్సర్‌కు నేరుగా సంబంధముందా?.. "నేరుగా మంటపై చపాతీ కాల్చడం, క్యాన్సర్ మధ్య ప్రత్యక్ష సంబంధం లేదు. క్యాన్సర్ ఒక సంక్లిష్ట వ్యాధి. పొగాకు, మద్యం, ఒత్తిడి, జీవనశైలి, అసమతుల్య ఆహారం వంటి అనేక కారణాలు ప్రభావితం చేస్తాయి. ఒక్క చపాతీ అలవాటు కారణం కాదు." అని డాక్టర్ చౌదరి స్పష్టం చేశారు. ఎంత తింటే ప్రమాదం.. చిన్న కాలిన మచ్చలున్న చపాతీని అప్పుడప్పుడు తినడం ప్రమాదకరం కాదు. ఒకేసారి ఎక్కువగా, తరచుగా, కాలిన చపాతీ/ఫుడ్ తీసుకోవడం వల్ల సమస్య మొదలవుతుంది. చపాతీ కాలిన మచ్చలు పెద్ద సమస్య కాదు కానీ.. ధూమపానం, ప్రాసెస్ చేసిన ఆహారం, ఎక్కువ చక్కెర, వ్యాయామం లేకపోవడం, నిద్రలేమి, దీర్ఘకాలిక ఒత్తిడి.. ఇవే ప్రధాన క్యాన్సర్ కారణాలు. అందుకే ఒకటి రెండు సార్లు ఇలాంటి చపాతీలు తినడం అంత హానికరమేమీ కాదని అన్నారు. గ్యాస్ మంటపై నేరుగా వండిన చపాతీని క్యాన్సర్ కలిగించే ఆహారంగా చూడవద్దు. మితమైన వినియోగం సురక్షితం. ఎక్కువగా కాలిన ఆహారాన్ని తరచుగా తీసుకోవడాన్ని మాత్రం పరిమితం చేయాలి. వంట పద్ధతులను సందేహం కాకుండా సమతుల్యతతో చూడండి. వైవిధ్యమైన ఆహారం, శారీరక చురుకుదనం, నిరూపిత ప్రమాదకారకాలను నివారించడం.. ఆరోగ్యకరమైన జీవనశైలికి ముఖ్యమైన వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ఎండు మాంసం కూర ఇలా చేస్తే.. ఎవరైనా ఆహా ఓహో అంటూ తినాల్సిందే!



ఎండు మాంసం కర్రీ గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. పల్లెటూరిలో ఈ కూరను ఎక్కువగా చేసుకుని తింటారు. కొందరు దీనిని వట్టి తునకలు అని కూడా అంటారు. తెలిసిందే కదా మటన్ కి ఉప్పు, పసుపు పట్టించి చేసే కూరనే ఎండు మాంసం కూర. ఇది తెలుగు రాష్ట్రాల్లో చాలా ఫేమస్. ఎండు మాంసం కూరను అన్నం, చపాతీల్లో వేసుకుని తింటారు. బాలింతలకు ఇది సూపర్ ఫుడ్ అని చెప్పొచ్చు.

కావాల్సిన పదార్థాలు : పావు కిలో ఎండు మాంసం (మటన్), చిన్న ఉల్లిపాయలు, 2 పచ్చిమిర్చి, 2 టేబుల్ స్పూన్స్ అల్లం వెల్లుల్లి పేస్ట్, 2 టేబుల్ స్పూన్స్ కారం, అర టీ స్పూన్ పసుపు, అర టీ స్పూన్ ధనియాల పొడి, అర టీ స్పూన్ గరం మసాలా, 2 టేబుల్ స్పూన్స్ నూనె, 2 టేబుల్ స్పూన్స్ చింతపండు తీసుకోవాలి. ముందుగా ఎండు మాంసం ముక్కలను శుభ్రపరిచి, వాటిని వేడి నీటిలో 10 నిముషాల పాటు ఉంచాలి. ఇలా చేయడం వలన అవి తినడానికి మెత్తగా అవుతాయి. ఇక ఇప్పుడు పాన్ లో ఆయిల్ వేసి, పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారే వరకు బాగా వేయించాలి. ఆ తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, నానబెట్టిన ఎండు మాంసం ముక్కలు వేసి 5 నిముషాల పాటు వేయించాలి. కొద్దీ సేపటికి కారం, రుచికి సరి పడినంత ఉప్పు వేయాలి. అంతే, ఎండు మాంసం కూర రెడీ.

# పాక్ కలరింగ్ మామూలుగా లేదుగా..!




ఓవైపు యుద్ధాలు.. ఇంకోవైపు కరువు కాటకాలు.. అన్నింటికీ మించి పేదరికం, అప్పుల కుప్పలు. ఇవన్నీ ఆ దేశంలో తాండవిస్తుంటే.. ఇంకోవైపు ఫ్యాషన్ షోలతో మా దేశం దూసుకుపోతోందని నమ్మించాలని చూస్తోంది దాయాది దేశం. లాహోర్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగిన ఒంంఓ ఫ్యాషన్ వీక్ జరిగింది. ఓవైపు యుద్ధాలు.. ఇంకోవైపు కరువు కాటకాలు.. అన్నింటికీ మించి పేదరికం, అప్పుల కుప్పలు. ఇవన్నీ ఆ దేశంలో తాండవిస్తుంటే.. ఇంకోవైపు ఫ్యాషన్ షోలతో మా దేశం దూసుకుపోతోందని నమ్మించాలని చూస్తోంది దాయాది దేశం. లాహోర్‌లో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగిన ఒంంఓ ఫ్యాషన్ వీక్ జరిగింది. ఈ ఫ్యాషన్ వీక్‌లో పాకిస్తాన్‌కు చెందిన మోడల్స్ లేటెస్ట్ ట్రెండీ దుస్తులతో కనిపించారు. ఈ ఫ్యాషన్ వీక్ పాకిస్తాన్‌కు చాలా కీలకం. ఎందుకంటే పాక్‌లో ఉన్న ప్రముఖ డిజైనర్లు, టాప్ మోడల్స్‌తో తమ టాప్ కలెక్షన్స్‌ను ప్రదర్శించారు. ఈసారి కూడా ప్రముఖ మోడల్స్‌ను దించారు. తమ లేటెస్ట్ ట్రెండ్స్‌ను చూపించారు. చిట్టిపొట్టి దుస్తుల నుంచి.. బ్రైడల్ కలెక్షన్స్ వరకు మోడల్స్ ర్యాంప్‌పై వయ్యారంగా నడుస్తూ ప్రదర్శించారు.
ఈ ఫ్యాషన్ వీక్‌ను 120 దేశాల్లో లైవ్ టెలికాస్ట్ చేసింది పాకిస్తాన్. ఎందుకంటే తమ దేశం గురించి గొప్పలు చెప్పకోడానికి ఏదో ఓటి చూపించుకోవాలిగా..! అదే లక్ష్యంతో ఫ్యాషన్ వీక్‌ను నిర్వహించింది. ఓవైపు బలూచిస్తాన్ తమ ఆర్మీపై విరుచుకుపడుతున్న సంగతిని పట్టించుకోవడంలేదు. ఆఫ్ఘనిస్తాన్ నిర్వహిస్తున్న మిషన్స్‌పైనా పెద్దగా పట్టింపులేదు. పైగా భారత్‌తో ఏళ్ల తరబడి కయ్యం పెట్టుకోవడం.. ఇప్పుడు క్రికెట్ దగ్గర తమ రాజకీయం చేస్తూ భారత్‌తో మ్యాచ్‌ను కూడా బాయ్‌కాట్ చేసింది పాకిస్తాన్. ఇన్ని తప్పులు, లోపాలు, దారుణాలు కప్పిబుచ్చుకునేందుకు ఇలాంటి ఫ్యాషన్ షోలను నిర్వహిస్తూ పైకి గంభీరాలకు పోతోంది. ఈ ఫ్యాషన్ షో? భారీ భద్రత నడుమ జరిగింది. ఎందుకంటే ఎక్కడి నుంచి ఏ ముష్కరుడు వచ్చి దాడులు చేస్తాడో అన్న భయం ప్రభుత్వంలో ఉంది. అసలే మహిళలపై కఠినంగా వ్యవహరించే గ్రూపులు చాలా ఉన్నాయి. అలాంటి వారి నుంచి రక్షించుకునేందుకు ఈ ఫ్యాషన్ వీక్‌ను భారీ భద్రత నడుమ నిర్వహించారు.

# ఆ నూనెలే గుండెలను కుళ్ల బొడుస్తున్నాయ్



తాజాగా చేసిన పరిశోధనల్లో ఆరోగ్య నిపుణులు నమ్మలేని నిజాలను బయట పెట్టారు. పెరుగుతున్న ఈ గుండెపోటు మరణాలకు క్వాలిటీ లేని వంట నూనెలే కారణమని తేల్చేసారు. తక్కువ ధరలో దొరికే నూనెల పైన కూడా ప్రభుత్వం టెస్ట్ లు చేసి, నాణ్యత లేకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచించారు. ఇప్పటికే ఎంతో మంది గుండె పోటుతో మరణించారు. అయితే, ఇవి రోజు రోజుకు పెరుగుతున్నాయి. అసలు, వీరికి సడెన్ గా గుండె పోటు ఎందుకొచ్చిందో ఇంత వరకు సరైన కారణాలు బయటకు రాలేదు. మనం ఎంత నూనె వాడుతున్నాం అనే దానికంటే, నాణ్యత ఉన్నది వాడుతున్నామా? లేక నాణ్యత లేనిది వాడుతున్నామా? అనేది తెలుసుకోవడం ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏంటంటే మనం వాడే ఏ ఒక్క నూనె కూడా మనకి అన్ని పోషకాలను అందించలేదు. కాబట్టి, నెలకి ఒకటి వాడుకోవడం బెటర్. లేదా అన్ని రకాల నూనెలను మిక్స్ చేసి వంటలకు వాడటం మంచిదని చెబుతున్నారు. మనం రోజూ వంటకు వాడే నూనెల్లో ఒమేగా-6 అధికంగా ఉంటుంది. మరి, దానికి తగ్గ ఒమేగా-3 ఫుడ్స్ ను బ్యాలెన్స్ చేయకపోతే గుండె జబ్బులు ఎక్కువుతాయనిఎం గట్టిగా హెచ్చరించారు. ఇప్పటి నుంచి వైద్యులు మందులతో పాటు వంట నూనె ఏది వాడాలో కూడా చెప్పాలని సూచించారు. దీని వలన కొలెస్ట్రాల్ లెవెల్స్ కూడా పెరగకుండా ఉంటాయని నిపుణులు వెల్లడించారు.

# కిలో బరువు తగ్గడానికి ఎన్ని అడుగులు నడవాలి..?



బరువు తగ్గడం అనేది చాలా మందికి ఒక పెద్ద సవాలుగా మారింది. ఇంటర్నెట్‌లో దొరికే రకరకాల పద్ధతులు ప్రయత్నించి అలసిపోయారా..? అయితే మీకోసం ఒక సింపుల్ అండ్ బెస్ట్ సొల్యూషన్ ఉంది.. అదే వాకింగ్.. కానీ ఊరికే అలా నడిస్తే సరిపోదు.. దానికి ఒక లెక్క ఉంది. ప్రస్తుతం మన దేశంలో మారుతున్న జీవనశైలి కారణంగా ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. బరువు తగ్గడానికి జిమ్‌లు, కఠినమైన డైట్లు ఎన్ని ఉన్నా.. వీటన్నింటికంటే అత్యంత సులభమైన, ఖర్చు లేని మార్గం నడక. అయితే కేవలం నడిస్తే సరిపోతుందా? బరువు తగ్గడానికి రోజుకు ఎన్ని అడుగులు నడవాలి? నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒక వ్యక్తి సుమారు 1 కిలో బరువు తగ్గాలంటే 3,500 కేలరీలు ఖర్చు చేయాలి. సాధారణంగా ఆరోగ్యవంతులైన వారు 2,000 అడుగులు నడిస్తే 100 కేలరీలు బర్న్ అవుతాయి. అంటే మీరు రోజుకు 10,000 అడుగులు నడవగలిగితే, సుమారు 500 కేలరీలు ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ఇలా క్రమం తప్పకుండా వారానికి 7 రోజులు చేస్తే.. మీరు 3,500 కేలరీలు ఖర్చు చేసి ఒక వారంలో దాదాపు 0.5 నుండి 1 కిలో బరువును ఆరోగ్యకరంగా తగ్గవచ్చు. చాలామంది ఉత్సాహంతో మొదటి రోజే గంటల తరబడి నడిచేస్తారు. కానీ అది కండరాల నొప్పులకు దారితీస్తుంది. కానీ అది కరెక్ట్ కాదు. మొదట రోజుకు 2,000 అడుగులతో ప్రారంభించి.. ప్రతి వారం ఆ సంఖ్యను పెంచుకుంటూ 10,000 లక్ష్యాన్ని చేరుకోవాలి. 10,000 అడుగులను ఒకేసారి కాకుండా చిన్న చిన్న భాగాలుగా విభజించండి. ఉదాహరణకు ఉదయం నిద్రలేవగానే ఒక చిన్న వాక్, ఆఫీసులో లిఫ్ట్‌కు బదులు మెట్లు వాడటం, రాత్రి భోజనం తర్వాత 15 నిమిషాల నడక.. ఇలా చేస్తే రోజు చివరికి లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు. నడక ఒక్కటే బరువు తగ్గడానికి సరిపోదు. మీరు నడిచి 500 కేలరీలు ఖర్చు చేసినా, తిరిగి అంతే మొత్తంలో జంక్ ఫుడ్ తింటే ఫలితం ఉండదు. మీరు తీసుకునే ఆహారంలో కనీసం 500 కేలరీలు తగ్గించుకోవాలని అధ్యయనాలు చెబుతున్నాయి. వైద్యులు సిఫార్సు చేసిన పౌష్టికాహారాన్ని మాత్రమే తీసుకోవాలి. ముఖ్యంగా అనారోగ్య సమస్యలు ఉన్నవారు నిపుణుల సలహా లేకుండా డైట్ మార్చకూడదు. నడక కేవలం బరువు తగ్గడానికే కాదు.. గుండె పనితీరును మెరుగుపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి కూడా తోడ్పడుతుంది. నడకతో పాటు వారానికి రెండు సార్లు చిన్నపాటి స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడం వల్ల శరీరం దృఢంగా మారుతుంది.

# యవ్వనంగా కనిపించాలంటే ఈ పండు పర్ఫెక్ట్..!



అవకాడో చూడటానికి చిన్నగా ఉంటుంది కానీ, దీనిలో ఉండే పోషకాలు ఇంక వేరే ఏ పండులో దొరకవు. అందుకే, ఈ పండు అంత విలువైనదిగా మారింది. ఇంకా చెప్పాలంటే వైద్యులు కూడా దీనిని తినమని చెబుతుంటారు. అవకాడో గుండె పని తీరును ఇది మెరుగు పరుస్తుంది. అంతేకాదు శరీరానికి కావాల్సిన పోషకాలను ఇది అందిస్తుంది. జీర్ణక్రియ పని తీరును కూడా మెరుగుపరుస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. మహిళల ఒక వయస్సు వచ్చాక యవ్వనంగా లేమని బాధ పడుతుంటారు. అలాంటి వారు ఈ పండును మీరు తినడం మొదలు పెడితే యవ్వనంగా కనిపిస్తారు. మెల్లి మెల్లిగా మీ చర్మం కాంతివంతంగా మారుతుంది. అవకాడోలో ఉండే పోషకాలు సన్నగా ఉండే వాళ్ళని లావుగా కూడా మార్చగలవు. అలాంటి శక్తి దీనికి ఉంది. కాకపోతే, దీనిని అరటి పండుతో తింటే మంచి ఫలితం ఉంటుంది. అవకాడోలో లూటిన్, యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి రేచీకటిని దూరం చేసి కంటి చూపును మెరుగుపరుస్తాయి. అలాగే, కళ్ళకు ఇతర సమస్యలు రాకుండా ఇవి కాపాడాతాయి. మీరు చిన్న చిన్న విషయాలను కూడా మర్చిపోతున్నట్లయితే అవకాడోను తింటూ ఉండండి. దీని వలన మీ మెదడు పని తీరు కూడా మెరుగుపడుతుంది. ఎందుకంటే, దీనిలో ఉండే కొవ్వులు మెదడు పని తీరును చురుకుగా చేస్తాయి.

# డీప్ ఫ్రై తర్వాత నూనెను పారబోస్తున్నారా?



మనం నిత్యం వంట నూనెను వాడుతూనే ఉంటాము. అలా వాడిన తర్వాత ఆ నూనెను సింక్ లో పారబోస్తారు. అయితే, ఆ నూనెను అలా వేస్ట్ చేయకండి. ఎందుకంటే, దీనితో ఆ నూనెను అనేక రకాలుగా వాడి ఇంట్లోని సమస్యలకు చెక్ పెట్టొచ్చు. నూనెలో డీప్ ఫ్రై చేసిన ఫుడ్ మన ఆరోగ్యానికి అంత మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. దీని గురించి తెలిసినా కూడా చాలా మంది వాడుతూనే ఉంటారు. అయితే, మీరు ఈ నూనెను వంటలకు కాకుండా వేరే వాటికీ వాడితే కొన్ని సమస్యలను తరిమికొట్టొచ్చు. పూరీలు వేసేటప్పుడు నూనెను బాగా డీప్ ఫ్రై చేస్తాము. అయితే, ఈ నూనెను వెంటనే పారబోయకండి. దీనిని వడకట్టి ఒక గిన్నెలోకి తీసుకుని వాటిలో లవంగాలను వేసి వేసి దీపం వెలిగించండి. దీని వలన దోమలు రాకుండా ఉంటాయి. మనం నిత్యం వాడే కొన్ని ఐరన్ వస్తువులు తుప్పు పడతాయి. అలాంటి వాటిని ఈ నూనెతో శుభ్ర పరచండి. మళ్ళీ అవి మంచిగా అయ్యి మెరుస్తాయి. మొక్కలలో ఎన్నో కీటకాలు ఉంటాయి. వీటిని ఈ నూనెతో వదిలించుకోవచ్చు. డీప్ ఫ్రై చేసిన నూనెను ఒక డబ్బాలో పోసి మీ పెరట్లో పెట్టండి. ఉదయం కానీ సాయంత్రం సమయంలో కానీ స్ప్రే చేస్తే అవి రాకుండా ఉంటాయి. ఇంకా చెప్పాలంటే ఈ నూనెతో తుప్పు పట్టిన కిటికీలను కూడా క్లీన్ చేయవచ్చు. మీరు కూడా ఒకసారి ప్రయత్నించి చూడండి. ఈ సారి నూనెను అస్సలు వేస్ట్ చేయకండి.

# వరల్డ్ కప్ రికార్డు నెలకొల్పిన న్యూజిలాండ్ ఓపెనర్లు

**యూఏఈపై 10 వికెట్ల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం**

**ప్రపంచకప్ చరిత్రలోనే రికార్డు ఓపెనింగ్ భాగస్వామ్యం నమోదు**

**విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగిన ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్**

**తొలుత బ్యాటింగ్ చేసి 173 పరుగులు చేసిన యూఏఈ**

**15.2 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా ఛేదించిన కివీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ తమ జైత్రయాత్రను కొనసాగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో, యూఏఈపై 10 వికెట్ల తేడాతో రికార్డు విజయాన్ని నమోదు చేసింది. కివీస్ ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగి, టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పి చరిత్ర సృష్టించారు. ఈ విజయంతో చెన్నైలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ గెలిచిన కివీస్, గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. యూఏఈ నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ కేవలం 15.2 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఆరంభం నుంచే యూఏఈ బౌలర్లపై విరుచుకుపడిన సీఫెర్ట్ (42 బంతుల్లో 89 నాటౌట్), అలెన్ (50 బంతుల్లో 84 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. తొలి 6 ఓవర్ల పవర్‌ప్లేలోనే 78 పరుగులు రాబట్టి మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షం చేసేశారు. ఈ క్రమంలో వీరిద్దరూ అజేయంగా 175 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. అంతకుముందు, యూఏఈ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో యూఏఈకి ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. కెప్టెన్ మహమ్మద్ వసీం (66 నాటౌట్), అలిషాన్ షరాఫు (55) అర్ధశతకాలతో రాణించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించారు. కివీస్ బౌలర్లలో మాట్ హెన్రీ రెండు వికెట్లు తీయగా, మిచెల్ శాంట్నర్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ విజయంతో న్యూజిలాండ్ గ్రూప్-సిలో తన రెండో విజయాన్ని నమోదు చేయగా, యూఏఈ ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ ఓటమిపాలైంది.

# షాడ్లీ వాన్ షాల్క్‌విక్.. అదరగొడుతున్న USA బౌలర్.. ఒకే ఓవర్‌శ్రీలో పాక్‌శ్రీను కోలుకోలేని దెబ్బ కొట్టాడు !

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖూూా బౌలర్ షాడ్లీ వాన్ షాల్క్‌విక్ పాకిస్తాన్‌శ్రీతో జరిగిన మ్యాచ్‌శ్రీలోనూ అదరగొట్టాడు. ఒకే ఓవర్‌శ్రీలో రెండు వికెట్లు పడగొట్టి అప్పటి దాకా దూకుడుగా ఆడుతున్న పాక్‌శ్రీను దెబ్బ కొట్టాడు. రెండు సిక్సులు, ఒక ఫోర్ కొట్టి స్కోర్ బోర్డును పరుగులు పెట్టిస్తున్న సయీమ్ అయూబ్ వికెట్ తీశాడు. అదే ఓవర్‌ఎలో పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా వికెట్ కూడా తీసి పాక్‌శ్రీకు చుక్కలు చూపించాడు. ఈ రెండు వికెట్లు తీసిన సమయానికి షాల్క్‌విక్ 2 ఓవర్లు బౌలింగ్ చేసి 8 పరుగులు మాత్రమే ఇచ్చాడు. టీమిండియాను బెంబేలెత్తించిన బౌలర్ కూడా షాల్క్‌విక్ కావడం గమనార్హం. సౌతాఫ్రికా సంతతికి చెందిన అమెరికా బౌలర్ షాడ్లీ వాన్ షాల్క్‌విక్ అద్భుత స్పెల్‌తో ఇండియా బ్యాటింగ్ నడ్డి విరిచాడు. ఆరో ఓవర్లో ఏకంగా మూడు వికెట్లు పడగొట్టి ఇండియాకు షాకిచ్చాడు. రెండో బాల్‌కు ఇషాన్ అనవసర షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. ఓ షాట్ పిచ్ బాల్‌తో తిలక్‌ను బోల్తా కొట్టించిన షాడ్లీ వాన్ తర్వాతి బాల్‌కే స్లో బౌన్సర్‌తో మరో హిట్టర్ శివం దూబె (0)ను డకౌట్ చేశాడు. దాంతో పవర్ ప్లేను ఇండియా 46/4తో ముగించింది. పేరున్న హిట్టర్లంతా తడబడిన వేళ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందుండి నడిపించడంతో టీ20 వరల్డ్ కప్‌లో ఇండియా శుభారంభం చేసిన సంగతి తెలిసిందే. గ్రూప్‌ఏ మ్యాచ్‌లో టీమిండియా 29 రన్స్ తేడాతో అమెరికాను ఓడించింది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్‌కు వచ్చిన ఇండియా 20 ఓవర్లలో 161/9 స్కోరు చేసింది. కెప్టెన్ సూర్య (84 నాటౌట్)కు తోడు తిలక్ వర్మ (25), ఇషాన్ కిషన్ (20) ఫర్వాలేదనిపించారు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ (4/25) సత్తా చాటాడు. ఛేజింగ్‌లో యూఎస్ టీమ్ 20 ఓవర్లలో 132/8 స్కోరు చేసి ఓడింది.



# ఇది ఐసీసీకి భారీ విజయం: పాక్ యూటర్న్‌పై బీసీసీఐ ఫస్ట్ రియాక్షన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో ఇండియాతో మ్యాచ్ ఆడే విషయంలో పాకిస్తాన్ యూటర్న్ తీసుకున్న సంగతి తెలిసిందే. బంగ్లాకు మద్దతుగా టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బాయ్ కాట్ చేస్తామన్న పాక్.. ఐసీసీ చర్చలు జరపడంతో దారిలోకి వచ్చింది. బాయ్ కాట్ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ఇండియాతో మ్యాచ్ ఆడేందుకు అంగీకరించింది. దీంతో ఇండియా, పాక్ మ్యాచ్‌పై నెలకొన్న నీలినీడలు తొలగిపోయాయి.

తాజాగా ఈ అంశంపై బీసీసీఐ స్పందించింది. షెడ్యూల్ ప్రకారం పాకిస్తాన్ మ్యాచ్ ఆడేందుకు ఒప్పుకోవడం సంతోషంగా ఉందని పేర్కొంది. ఇది ఐసీసీ సాధించిన భారీ విజయమని బీసీసీఐ అభివర్ణించింది. ఈ మేరకు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా మీడియాతో మాట్లాడుతూ.. ఐసీసీ, పీసీబీ, బీసీబీ మధ్య జరిగిన చర్చల ఫలితం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

వ్యక్తిగత అంశాలను పక్కనబెట్టి క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వడానికి ఇది మంచి పరిష్కారమని అన్నారు. ఈ ఇష్యూపై ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించి యధావిధిగా మ్యాచ్ జరిగేలా కృషి చేసిన ఐసీసీకి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పాకిస్తాన్‌ను చర్చల పట్టికలోకి తీసుకువచ్చి 2026, ఫిబ్రవరి 15న షెడ్యూల్ ప్రకారం ఇండియా, పాక్ మ్యాచ్ జరిగేలా చేయడం ఐసీసీ సాధించిన అతి పెద్ద విజయమని ప్రశంసించారు. ఫిబ్రవరి 15న కొలంబోలో ఇండియా, పాక్ మ్యాచ్ యధావిధిగా జరుగుతుందని.. ఇది క్రికెట్ ప్రియులందరికీ శుభవార్త అని అన్నారు. షెడ్యూల్ ప్రకారం మ్యాచులు జరగనుండటంతో ఇండియా, శ్రీలంక వేదికలుగా జరుగుతోన్న ఈ వరల్డ్ కప్ గ్రాండ్ సక్సెస్ అవుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ‘ఓ రోమియో‘ కోసం తమన్నా, విక్రాంత్ మాస్సే త్యాగం!



మంగళ మ్యాజిక్ కోసం అభిమానులకు ఆశికా రంగనాథ్ కృతజ్ఞతలు తెలిపారు

ముంబయి అండర్ వరల్డ్ డాన్‌ల రియల్ స్టోరీస్‌లతో రూపొందిన బుక్ -మాఫియా క్వీన్స్ ఆఫ్ ముంబయి-. దీని ఆధారంగా ఇప్పటికే సంజయ్ లీలా భన్సాలీ -గంగుబాయి కతియావాడి-ని రూపొందించిన సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఇదే బుక్‌ని ఆధారం చేసుకుని విశాల్ భరద్వాజ్ మరో గ్యాంగ్‌స్టర్ స్టోరీని తెరపైకి తీసుకొస్తున్నారు అదే -ఓ రోమియో-. షాహీద్ కపూర్ హీరోగా నటించాడు. -యానిమల్- ఫేమ్ త్రిప్తి దిమ్రీ హీరోయిన్. ఫిబ్రవరి 13న భారీ స్థాయిలో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలోని కీలక పాత్రల్లో విలక్షణ నటుడు నానా పటేకర్, తమన్నా, దిషా పటానీ, అవినాష్ తివారీ, ఫరీదా జలాల్ నటిస్తున్నారు. మరో కీలక అతిథి పాత్రలో -12వ్త ఫెయిల్- ఫేమ్ విక్రాంత్ మాస్సే నటిస్తున్నాడు. ముంబయి అండర్ వరల్డ్ డాన్ ఉస్తారాగా షాహీద్ కపూర్ నటించగా, అతని ప్రేయసి అఫ్షాగా త్రిప్తి దిమ్రీ నటించింది. ఇటీవల ఉస్తారా కుమార్తె అభ్యంతరాలు చెప్పడం, కోర్టును ఆశ్రయించడంతో వివాదంలో చిక్కుకున్న ఈ సినిమా ఎట్టకేలకు అన్ని అడ్డంకుల్ని అధిగమించి ఫైనల్‌గా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. తొలి సారి దర్శకుడు విశాల్ భరద్వాజ్ రా అండ్ రస్టిక్ కంటెంట్‌తో చేసిన ఈ మూవీ ఇప్పటికే బాలీవుడ్ ట్రేడ్ వర్గాలతో పాటు మేకర్స్‌లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉంటే సినిమా రిలీజ్‌కి సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇప్పటికే మేకర్స్ ప్రయోషన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ మూవీలో నటించిన తమన్నా, విక్రాంత్ మాస్సేలకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం నెట్టింట ట్రెండ్ అవుతోంది. ఈ మూవీలో తమన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, విక్రాంత్ మాస్సే కీలక అతిథి పాత్రలో కనిపించనున్నాడు.



చాక్లెట్ లేదా ఎస్ప్రెస్సో? సాక్షి మాలిక్ యొక్క సిజ్లింగ్ మిర్రర్ మూమెంట్





అయితే ఈ క్యారెక్టర్ల కోసం ఈ ఇద్దరు స్టార్స్ ఓ త్యాగం చేశారట. ఈ విషయాన్ని దర్శకుడు విశాల్ భరద్వాజ్ స్వయంగా సినిమా ప్రమోషన్స్‌లో వెల్లడించడం గమనార్హం. ఇంతకీ విషయం ఏంటంటే ఈ మూవీలో నటించడానికి తమన్నా, విక్రాంత్ మాస్సే ఎలాంటి రెమ్యునరేషన్ తీసుకోలేదట. డైరెక్టర్ విశాల్ భరద్వాజ్, నిర్మాత సాజిద్ నదియావాలాపై ఉన్న నమ్మకంతో ఎలాంటి పారితోషికం తీసుకోలేదట. రెమ్యూనరేషన్‌లకు మాత్రం ప్రియారిటీ ఇచ్చే బాలీవుడ్‌లో తమన్నా, విక్రాంత్ మాస్సే -ఓ రోమియో- కోసం ఎలాంటి పారితోషికం తీసుకోకుండా నటించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ మూవీలో తమన్నా రబియాగా, దిషా పటానీ జూలీగా కనిపించనున్నారు. విక్రాంత్ మాస్సే మాత్రం ఓ ప్రత్యేక అథిగా క్యారెక్టర్‌లో మెరవనున్నాడు. గతంలో విశాల్ భరద్వాజ్‌కు చేసిన ప్రామిస్ కారణగానే తను పారితోషికం తీసుకోలేదని చెబుతున్నారు. ఇక తమన్నా ఈ మూవీ కోసం 12 రోజులు కేటాయించిందట. స్టోరీతో తనది కీ రోల్ కావడం, తక్కువ టైమ్ మాత్రమే ఉండటం, మంచి ఇంపాక్ట్ కలిగించే క్యారెక్టర్ కావడం, విశాల్‌భరద్వాజ్ సినిమా కావడం వల్లే తమన్నా కూడా పారితోషికం తీసుకోలేదట.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965